RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

సంచిక 59 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | ఆగస్టు 27, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## నీలగిరి నిత్యపద్యం

ఆటవలది

కుళ్ళిపోయినట్టి కూరలు పండ్లును
కుళ్ళు బోతు తనము గుణమునున్న
పనికిరావు నొకటి పగతుడౌను నొకరు
జగతినందు జరుగు సత్యమిదియె
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.

## పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

నిపుణులతో కమిటీల ఏర్పాటు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




## కెఎన్ఎస్ యూతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంఓయూ

- మంత్రి వాకిటి శ్రీహరికి సీఎం అభినందనలు



**హైదరాబాద్,ఆగస్టు 26 :** యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రపంచంలోనే అత్యున్నత పని తీరు కలిగిన క్రీడలకు ప్రముఖ సంస్థల్లో ఒకటైన కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ (కెఎన్ఎస్ యూ) తో ఎంఓయూ కుదుర్చుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గతంలో తన దక్షిణ కొరియా పర్యటనలో కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ అధ్యక్షులు మూన్ వోన్-జే తో సహా ఉన్నత ప్రతినిధి బృందాన్ని కలిశానని గుర్తు చేశారు. ప్రతిపాదిత యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, కెఎన్ ఎస్ యూమధ్య భాగస్వామ్యం కోసం తాము వివరంగా చర్చించినట్టు తెలిపారు. ఈ భాగస్వామ్యం ఇప్పుడు కేవలం ఒక ఎంఓయూ కంటే ఎక్కువ. ఇది తెలంగాణ క్రీడా ప్రతిభకు, అథ్లెట్ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్,

మిగతా2లో...




## నేపాల్‌లో ఆకస్మిక వరదలు

- వరదల్లో వందలాది మంది గల్లంతు
- అందులో 105 మంది భారతీయులున్నట్లు అంచనా
- టిబెట్‌లో భారీ వర్షాలతో ఉప్పొంగిన కోశీనది
- బురదమయంగా మారిన కొండతీర ప్రాంతం

## ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

- భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ
- మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు
- సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి



**హైదరాబాద్,ఆగస్టు 26 :** కాంగ్రెస్‌లో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నా యి. క్రమశిక్షణ కమిటీ నివేదిక అందిన తరవాత కొండామురళి రంగంలోకి దిగారు. నేరుగా ఆయన డిప్యూటి సిఎం భట్టిని కలిశారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు. తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల

మిగతా2లో...

## ఇందిరమ్మ ఇండ్లు.. ఫైనల్ బిల్లులను మేమే చెల్లిస్తాం: పొంగులేటి



**హైదరాబాద్,ఆగస్టు 26 :** పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయినా రాష్ట్ర ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం నుంచి

మిగతా2లో...

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఆగివున్న లారీని

ఢీకొన్న ట్రావెల్ బస్సు

ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికుల దుర్మరణంమృతులంతా ఏపికి చెందిన వారిగా గుర్తింపు - ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి

వ్యక్తం చేసిన సిఎం రేవంత్

తక్షణ సహాయక చర్యలకు ఆదేశం...







## వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

- సోషల్ ఇంజనీరింగ్ నాటకాలకు తెర
- అప్రమత్తంగా ఉండాలన్న సిపి సజ్జనార్


## నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

- కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి
- గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్, ఆగస్టు 26 :** నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు జరిగాయి. కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని, గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. ఉత్సవాల్లో భాగంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగింది. అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం: సభలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు

మిగతా2లో...



## అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

చెట్టును ఢీకొన్న కారు....ముగ్గురు దుర్మరణం

నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం

**నిజామాబాద్, ఆగస్టు 26 :** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు కుటుంబసభ్యులకు

మిగతా2లో...

## 22ఎను వెంటనే తొలగించాలి

లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం

భూకబ్జాల హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ

రేవంత్ ప్రభుత్వం భూ అమ్మకాలతో బిజీ

బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

**ఖాట్మండు ఆగస్టు 26 :** నేపాల్‌లో మెరుపు వరదలు భీభత్సం సృష్టించడంతో భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగింది. ఈ ఘటనలో కనీసం 95 మంది మృతి చెందినట్టు నిర్ధారణ కాగా, 400 మందికి పైగా గల్లంతయ్యారు. వీరిలో కనీసం 133 మంది భారతీయులున్నారు. అనేక భవనాలు, వాహనాలు, ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. బురదలో ఇంకా అనేక మంది కూరుకుపోయినట్టు అంచనా వేస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే, భూకంపం, ఆపై కొండచరియలు విరిగిపడటంతోనే భోటెకోశీ నది ప్రళయానికి కారణమని నేపాల్ విదేశాంగ శాఖ శిశిర్ ఖనాల్ వెల్లడించింది. ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో భూకంపం వచ్చిందని, దాంతో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయని చెప్పారు. నదీ ప్రవాహానికి కొండచరియలు అడ్డుపడటం ఆకస్మిక వరదలకు కారణమైనట్టు తెలుస్తోందని చెప్పారు. అధికారుల సమాచారం ప్రకారం, బుధవారం ఉదయం 9 గంటల సమయంలో టిబెట్ వైపు నుంచి వచ్చిన ఉద్ధృతి భోటేకోశి నదిలోకి చేరింది. దీంతో టిమురే, స్యాఫ్రు బేస్ ప్రాంతాలు తీవ్రంగా ప్రబావితమయ్యాయి. గ్యిరాంగ్ సరిహద్దు క్రాసింగ్ సమీపంలోని టిబెట్ ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా, మరికొందరు గల్లయంతయ్యారని చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్హువా వార్త సంస్థ తెలిపింది. నేపాల్–టిబెట్ సరిహద్దుకు చైనా వైపు ఏర్పాటు చేసిన భద్రతా కమెరాల్లో భారీగా రాళ్లు, నీటితో కూడిన వరద ప్రవాహం ఈ ప్రాంతాన్ని ముంచెత్తడానికి కొన్ని క్షణాల ముందు ప్రజలు పరుగులు తీస్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం ఆ వరద భవానాలు, వాహనాలను ధ్వంసం చేసిన పలువురు ప్రాణాలను బలిగొంది. కొండ చరియలు విరిగిపడడానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియనప్పటికీ.. జర్మన్ రీసెర్ట్ సెంటర్ ఫర్ జియోసైన్స్ (జీఎఫ్‌జడ్) ఆసక్తికరమైన విషయం వెల్లడించింది. భద్రతా కెమెరాలో దృశ్యాలు కనిపించిన సమయానికి సుమారు ఏడు నిమిషాలకు ముందు 4.4 తీవ్రతో భూమి కంపించినట్టు జీఎఫ్‌జడ్ తెలిపింది. భూకంపం అనంతరం కొండచరియలు విరిగిపడటం, టిబెట్ నుంచి వచ్చిన ఉద్ధృతి భోటెకోశి నదిలోకి చేరడంతో నేపాల్‌లో భారీ విలయం సంభవించిందని చెబుతున్నారు. మెరుపు వరదలకు సంబంధించి ముందస్తు వార్నింగ్ ఇవ్వడంలో చైనా విఫలమైందనే ఆరోపణలు నేపాల్‌లో వినిపిస్తున్నాయి.

# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పుడే వీరంతా ఎందుకు భేటీ అయ్యరన్నది చర్చ జరుగుతోంది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ వ్యాఖ్యలు చేసింది. ఎ–లాన్–బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను‘ అని కొండా మురళి వ్యాఖ్యానించారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. ’మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?’ అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. ఉత్తమ్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా వెళ్లిపోయారు. తాను సిఎంకు, పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో వేలాది గా ,ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్. నుడచైర్మన్ కేశ వెను, శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్ ,

జావిద్ అక్రమ్, కుద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్ రహీల్, నయీమ్ షారాన్, అబ్దుల్ కరీం, అబుద్ బిన్ హందన్, అన్వార్, మొహమ్మద్ అహ్మద్, కో ఆప్షన్ మెంబెర్ మహేందర్ సింగ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మొయిన్, మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# 22ఎను వెంటనే తొలగించాలి

**హైదరాబాద్,ఆగస్టు 26 :** కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22–ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమిషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22–ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22–ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22–ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది.

కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూ ర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరా బాద్‌లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసి పోయిందని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు.

# వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

**హైదరాబాద్,ఆగస్టు 26 :** హైదరాబాద్ నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల ని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ఫోన్లను దొంగిలిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను మొ దట గుర్తిస్తారని.. స్క్రీన్ లాక్ ఎలా ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి నిశితంగా గమనించి అనంతరం చోరీ చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి.. పాస్‌వర్డ్ తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా 'సోషల్ ఇంజినీరింగ్' నాటకాలకు తెరలేపుతారని సీపీ చెప్పారు. బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి.. తాము బస్సు కండక్టర్/ డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని.. వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని కెయిమ్ చేస్తున్నారని చెబుతారు. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక పోర్టల్‌లో మొబైల్ ఎఓఇఎ నంబర్ నమోదు చేసి ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయించాలి. ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి‘ అని సీపీ సూచించారు.

# అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**సూర్యాపేట,ఆగస్టు 26 :** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వార కుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాల య్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్న్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

# పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

**హైదరాబాద్,ఆగస్టు 26 :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026–ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌ను పెట్టుబడులను ఆకర్షించేలా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. హైదరాబా ద్‌లోని మహా త్మా జోతిబా పూలే ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల, ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని భట్టి సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవాలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగా హన ఒప్పం దాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగిం చాలన్నారు. డిసెంబర్‌లో జరిగే సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్‌షో లు నిర్వహి ంచి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహిం చాలనీ, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను సయమపాలన ప్రకారం పూర్తి చేయాలని భట్టి స్పష్టం చేశారు.

# కెఎన్ఎస యూతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంఓయూ

(మొదటి పేజీ తరువాయి)

హై–పెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్ లో ప్రపంచ ఉత్తమ విధానాలకు మధ్య ఒక వారధి అని ఆయన పేర్కొన్నారు. కెఎన్ఎస్ యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్ లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాలలో 16 పతకాలను అందించారు. అలాంటి శ్రేష్టమైన సంస్కృతిని తెలంగాణకు తీసుకురావాలని తాము కోరుకున్నట్టు ఆయన తెలిపారు. అలాంటి కార్యక్రమాన్ని ముందుకు నడిపించి, మన యువ అథ్లెట్లు ప్రపంచ క్రీడా శ్రేష్టత నుంచి నేర్చుకునేందుకు కొత్త మార్గాలను తెరిచిన రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి, క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులకు, స్పోర్ట్స్ యూనివర్సిటీకి అభినందనలు తెలిపారు. దీంతో మన గ్రామాలు, పట్టణాల నుండి ఒలింపిక్ పోడియం వరకు తెలంగాణ ఈ ప్రయాణానికి సిద్ధమవుతోందని చెప్పారు. భారత్ 2036 ఒలింపిక్స్ వైపు చూస్తున్న తరుణంలో, తెలంగాణ సిద్ధంగా ఉండాలని నిశ్చయించుకుందని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లు.. ఫైనల్ బిల్లులను మేమే చెల్లిస్తాం: పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

రావాల్సిన నిధుల కోసం ఏడాదిగా ఎదురుచూశామని, పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి విడుదల కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్టానికి కేంద్ర మంత్రి వచ్చిన సందర్భంలో, రెండు వారాల క్రితం పార్లమెంట్ సభ్యులతో కలిసి తాను స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశానని మంత్రి పొంగులేటి తెలిపారు.

అయినప్పటికీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశ పెట్టుకుని పేద ప్రజలను ఇంకా ఎన్నాళ్లు ఇబ్బంది పెట్టాలని ఆయన ప్రశ్నించారు.

ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు చివరి బిల్లు కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో గురువారం జమ అవుతాయని ఆయన తెలిపారు. మిగిలిన వారికి కూడా విడతల వారీగా నిధులు చెల్లిస్తామన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## అంగరంగ వైభవంగా శ్రీరామ హృదయ కలశ యాత్ర



అమ్రాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అచ్చంపేట మండలం పుల్జాల గ్రామంలో శ్రీరామ హృదయ కలశ యాత్ర భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది.గ్రామ వీధుల గుండా కలశాన్ని ఊరేగించగా, భజన బృందాల సంకీర్తనలు, మహిళల కోలాటాలు, భక్తుల నామస్మరణతో వాతావరణం మార్మోగిపో యింది. అనంతరం కలశాన్ని శ్రీరామాలయంలో ప్రతిష్టించి, భక్తులు తమ ఇళ్ల నుండి తెచ్చిన పిడికెడు బియ్యాన్ని రామనామ జపంతో సమర్పించారు.కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త పాపిశెట్టి అశోక్ కుమార్, మండల సమన్వయకర్త బైరు శ్రీనివాసులు, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, తిరుపతయ్య, పంగా రాములు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా మీలాదున్నబీ వేడుకలు

అమ్రాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మీలాదున్నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్రాబాద్ మండల కేంద్రంలోని జామె మసీదు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.ముస్లిం మైనారిటీలు ర్యాలీ నిర్వహించి, ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రజలకు మిఠాయిలను పంపిణీ చేశారు. జామె మసీదు అధ్యక్షుడు అబ్బాస్ అలీ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం శాంతి, ప్రేమ, దయ, కరుణ సందేశాలను బోధించారని, ఆయన బోధనలను ఆచరణలో పెట్టే ఉద్దేశంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అక్మల్ జానీ, కమిటీ సభ్యులు జాఫర్, ఇజహార్, ఇస్మాయిల్, సాజిద్, ఇంతియాజ్, జావీద్ తదితరులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## జనగణన పారితోషికంతో ఆలయానికి ఫ్యాన్ల ఏర్పాటు



ఖానాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జనాభా గణనలో ఎన్యూమరేటర్‌గా పనిచేసి పొందిన పారితోషికంతో ఖానాపూర్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్, సింగపూర్ పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నాలుగు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.ఆలయ కమిటీ చైర్మన్ కట్ట రాజేష్, సర్పంచ్ అలుగుల లత శంకర్, ప్రధాన పూజారి లింగయ్యలు వేసవి కాలంలో గణన విధుల ద్వారా వచ్చిన డబ్బులతో ఆలయానికి సేవ చేసిన వాల్గోట్ కిషన్‌ను అభినందించారు.

## వర్షాకాల వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య చర్యలు



ఖానాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఖానాపూర్ మున్సిపల్ 5వ వార్డులో కౌన్సిలర్ మేస పోసమ్మ నాయకులు సతీష్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇంద్రనగర్ నుండి కరీంకాలని వెళ్లే ప్రధాన రహదారికి తాత్కాలిక మర మ్మత్తులు చేయించగా, కాలనీలలో దోమల నివారణ కోసం స్ప్రే పిచికారీ నిర్వహించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరంతరంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిస రాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కాలనీ వాసులు ఈ చర్యలపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పరిశీలకుడు మానాల శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై మహాధర్నా పిలుపు




ఖానాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల సాధన కోసం ఈ నెల 27న జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ అధ్యక్షుడు సౌధాని భూమన యాదవ్, ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. "పోరాడితే పోయేదేమీ లేదు -- సమస్యల సాధన తప్ప" అని వారు పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ దీక్షా శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గొడుగులు వెంట తీసుకురావాలని సూచించారు.ఈ మహాధర్నాకు ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ ముఖ్య అతి థిగా హాజరుకానున్నారు. జిల్లా, మండల స్థాయి నాయకులు సభ్యులను చరవాణి ద్వారా సంప్ర దించి దీక్షా శిబిరానికి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూ నియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగన్న, వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



ఖానాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఖానాపూర్ పట్టణంలోని పద్మావతి నగర్ 7వ వార్డులో ఆకుల పోషన్న తల్లి మరణం సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు ఏడో వార్డు కౌన్సిలర్ నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం రాజురా సత్యం, మస్కాపూర్ సర్పంచ్ దయానందన్న, జూని నయీమ్, సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగిలి శంకర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సానుభూతి తెలియజేశారు.

## రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు



ఖానాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అఖిల భారత రైతు--కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలు సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలోని శ్రీనివాస గార్డెన్‌లో జరగనున్నాయి. ఖానాపూర్ ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో జరిగిన సన్నాహక సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మహాసభలను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ మామిడాల భిక్షపతి అధ్యక్షత వహించనుండగా, రచయిత కె. శ్రీనివాస్ ప్రారంభోపన్యాసం చేయనున్నారు. జాతీయ అధ్య క్షుడు కామ్రేడ్ వేములపల్లి వెంకట్రామయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు ప్రసంగించనున్నారు. అరుణోదయ కళాకారుల ఆటపాటలు ప్రత్యేక ఆకర్ష ణగా ఉండనున్నాయి. కార్యక్రమంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కార్యదర్శి ఎల్.ఆర్. ఉపాలి, సంయుక్త కార్యదర్శి గోగు శేఖర్, కోశాధికారి కుడుదుల రాజేశ్వర్, కమిటీ సభ్యుడు మానుక శ్రీనివాస్, నాయకులు గుట్ల ప్రసాద్, గోనె స్వామి, నాగవత్ రవి తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధి భద్రతపై స్పష్టత కోరిన ఏఐటీయూసీ




సుల్తానాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఆధునిక టెక్నాలజీ పేరుతో మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధికి భంగం కలిగిస్తే సహించేది లేదని ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ హెచ్చరించారు.మంథని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అధునాతన కిచెన్ టెక్నాలజీని స్వాగతిస్తున్నప్పటికీ, దాని వల్ల కార్మికుల ఉపాధి భద్రతకు ముప్పు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు తయారు చేసే సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయడం మంచిదేనని, కానీ కార్మికులను ఉపాధి నుంచి తొలగించే ప్రయత్నాలు చేయొద్దని హెచ్చరించారు.అక్షయ ఫౌండేషన్‌తో ప్రభుత్వం రహస్య ఒప్పందం చేసుకుందని ఆరోపిస్తూ, యంత్రాలు రావడంలో తప్పులేదని కానీ వాటి కారణంగా కార్మికుల కడుపు కొట్టే పరిస్థితి వస్తే ఉద్యమాలు తప్పవని అన్నారు.మధ్యాహ్న భోజన కార్మికుల ఉద్యోగ, ఉపాధి భద్రతపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందన రాకపోతే కార్మికులను సమీకరించి ఐక్య ఉద్యమాలకు రూపకల్పన చేసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని కడారి సునీల్ హెచ్చరించారు.

## ఘనంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



కరీంనగర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు బుధవారం నగరవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో మేయర్‌ను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ క్యాంపు కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం శివభక్త హనుమాన్ దేవాలయం, కోదండరామాలయం, మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తీగలగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వెంకటాద్రి హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. వివేకానంద చౌరస్తా, తెలంగాణ చౌక్, చింతకుంట శాంతినగర్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. తెలంగాణ చౌక్ వద్ద 39 కిలోల భారీ కేక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అభిమానులు, కార్యకర్తలు అన్నదాన కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు కాలనీ వృద్ధాశ్రమంలో మేయర్ స్వయంగా అన్నప్రసాదం అందించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ప్రేమాభిమానాలు తనపై మరింత బాధ్యతను పెంచాయని, కరీంనగర్ నగర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు .వేడుకల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు మార్, బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభి మా నులు, నగర ప్రజలు పాల్గొని మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పాముకాటు బాధితుడికి పునర్జన్మ

**– ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన యశోద ఆసుపత్రి వైద్యులు**



కల్వకుర్తి, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పాముకాటుతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఒంగోలు మండలానికి చెందిన శేఖర్‌ను మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సకాలంలో అత్యవసర చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. పాము విషం కారణంగా నాడీ వ్యవస్థ, శ్వాసకోశం, గుండె పనితీరు తీవ్రంగా దెబ్బతినడంతో ఆయన విషమ పరిస్థితిలో ఆసుపత్రికి చేరుకున్నారు.ఛాతీనొప్పి, స్పృహ కోల్పోవడంతో శేఖర్‌ను కుటుంబ సభ్యులు యశోద ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో న్యూరోటాక్సిక్ స్నేక్ ఎన్వెనమేషన్, అక్యూట్ ఎన్సెఫలోపతి, తీవ్రమైన శ్వాస వైఫల్యంతో పాటు గుండె ఎడమ జఠరిక పనితీరు గణనీయంగా తగ్గినట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వెంటనే వెంటిలేటర్‌పై ఉంచి యాంటీ స్నేక్ వెనమ్ అందించారు. క్రిటికల్ కేర్ విభాగంలో నిరంతర పర్యవేక్షణతో చికిత్స కొనసాగించారు.చికిత్సకు శేఖర్ క్రమంగా స్పందించడంతో నాడీ వ్యవస్థ పనితీరు, స్పృహలో గణనీయమైన మెరుగుదల కనిపించింది. శ్వాసకోశ పనితీరు మెరుగుపడటంతో కొంతకాలం తర్వాత వెంటిలేటర్ నుంచి విజయవంతంగా బయటకు తీసుకువచ్చారు. గుండె పనితీరుతో పాటు ఎలక్ట్రోలైట్ అసమతుల్యతలను వైద్యులు సమర్థవంతంగా నియంత్రించడంతో ఆయన ఆరోగ్యం క్రమంగా స్థిరపడింది. ప్రస్తుతం శేఖర్ పూర్తిగా కోలుకుని, స్థిరమైన ఆరోగ్యంతో ఇంటికి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా వైద్యులు డా. రంగా సంతోష్ కుమార్, డా. కళాధర్, డా. శబరీనాథ్ సముద్రాల మాట్లాడుతూ.. న్యూరోటాక్సిక్ పాము విషం నాడులు, కండరాల పనితీరును తీవ్రంగా దెబ్బతీసి ప్రాణాపాయ పరిస్థితికి దారితీయవచ్చని తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో సకాలంలో యాంటీ స్నేక్ వెనమ్ అందించడంతో పాటు శ్వాసకోశానికి అవసరమైన సహాయక చికిత్స అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.యశోద ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిటూరి మాట్లాడుతూ.. వివిధ వైద్య విభాగాల సమన్వయం, అత్యాధునిక ఐసీయూ సదుపాయాలు, మెకానికల్ వెంటిలేషన్, నిరంతర మానిటరింగ్ ద్వారా విషమ పరిస్థితుల్లో ఉన్న రోగులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.పాముకాటుకు గురైన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సదుపాయాలు ఉన్న సమీప ఆసుపత్రికి బాధితుడిని తరలించాలని వైద్యులు సూచించారు. సకాలంలో సరైన వైద్యం అందిస్తే పాముకాటు బాధితుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

# నల్లగొండలో ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

**– భక్తిశ్రద్ధలతో మిలాద్ జూలూస్.. 300 మందికి అన్నదానం**



నల్లగొండ, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమ, శాంతి, సోదరభావ సందేశాలతో నల్లగొండ పట్టణ పురవీధులు మార్మోగాయి. ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో మిలాద్ జూలూస్ కమిటీ అధ్యక్షుడు సల్మాన్ ఖాద్రి ఆధ్వర్యంలో మిలాద్ జూలూస్‌ను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లగొండ డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ (అమేర్), వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. దర్గా మెట్ల వద్ద ప్రారంభమైన ర్యాలీ గడియారం సెంటర్, ఆర్పీ రోడ్డు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, ఓల్డ్ సిటీ చౌరస్తా, గంజ్ బజార్ మీదుగా సాగి తిరిగి దర్గా మెట్ల వద్ద ముగిసింది.హైదరాబాద్ నుంచి విచ్చేసిన ప్రముఖ నాత్ గాయకులు ర్యాలీలో పాల్గొని వీధుల గుండా పాదయాత్ర చేస్తూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమను చాటుతూ నాత్ పాటలు ఆలపించారు. వారి గానంతో పట్టణ పురవీధులు మార్మోగాయి. భక్తులు పరస్పరం స్వీట్లు పంచుకుంటూ ఆనందోత్సాహాలతో మిలాద్ వేడుకల్లో పాల్గొన్నారు.అనంతరం దర్గా మెట్ల వద్ద సుమారు 300 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధులు మిలాద్ సందడితో కళకళలాడాయి. ప్రవక్త మహమ్మద్ సందేశమైన ప్రేమ, శాంతి, సోదరభావాన్ని ప్రజల్లో చాటేలా కార్యక్రమం సాగింది.ఈ కార్యక్రమంలో మిలాద్ జూలూస్ కమిటీ అధ్యక్షుడు సల్మాన్ ఖాద్రి, వైస్ ప్రెసిడెంట్ ఆబేద్, అడ్వైజర్ ఎం.డి. కలీమ్ ఖాన్ (జర్నలిస్ట్), మిలాద్ కమిటీ అధ్యక్షుడు మసి ఉద్దీన్ (అడ్వకేట్), కార్యదర్శి అబిద్, సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు హాశం, సలీం, పీస్ కమిటీ సభ్యులు, ఎంఐఎం సీనియర్ నాయకులు ఖాజా గౌస్ మొహియుద్దీన్, విద్యార్థి సంఘం నాయకులు కట్టెల శివ, బీఆర్ఎస్ నాయకులు జమాల్ ఖాద్రి, సీపీఎం నాయకులు దండంపల్లి సత్తయ్య, కమిటీ సభ్యులు సుఫియన్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో మెడిప్లస్ మెడికల్ షాప్ ప్రారంభం

**– ప్రజలకు స్థానికంగానే అందుబాటులోకి మందులు, ఆరోగ్య సేవలు**

**– ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం**





ఎలిగేడు, ఆగస్టు 26(నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడిప్లస్ మెడికల్ షాప్ను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ షాప్ నిర్వాహకులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. మెడిప్లస్ మెడికల్ షాప్ ప్రారంభంతో ఎలిగేడు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అవసరమైన మందులు, ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులు స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో మందుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గనుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే విజయరమణారావు, ప్రజలకు నాణ్యమైన మందులు, విశ్వసనీయమైన సేవలు అందించడంలో మెడిప్లస్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఆరోగ్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు రోగులకు సకాలంలో అవసరమైన మందులు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

అనంతరం మహిళలు ఎమ్మెల్యే విజయరమణారావుకు ముందస్తు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలుపుతూ సోదరభావానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందేశాన్ని గుర్తుచేశారు.



కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్, సింగిల్ విండో చైర్మన్ సామా రాజేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ ముంజం నరేష్, నాయకులు చింతకుంట మనోహర్ రావు, తాటిపల్లి రమేష్ బాబు, బూర్ల సత్యనా రాయణ, అమ్ముల రమేష్, బోగే సతీష్ తదితరులతో పాటు మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ, ఆగో మోర్ ఫ్రెష్ సూపర్ మార్కెట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**సుల్తానాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సుల్తానాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎవం స్పోర్ట్స్ అకాడమీ మరియు ఆగో మోర్ ఫ్రెష్ సూపర్ మార్కెట్ ను రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మండలానికి చెందిన ఆడబిడ్డలు రాఖీ పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే విజయరమణ రావుకు ముందస్తుగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామస్థాయి నూతన కమిటీ ఏర్పాటు



**హుస్నాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామ కాంగ్రెస్ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు మాజీ అధ్యక్షుడు అలువోజు కుమార్‌స్వామి ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు వెన్న రాజు, యువజన అధ్యక్షుడు పోచవేని శ్రీశైలం పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. మాం దాటి వెంకట్‌రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షుడిగా, వెల్దండి అజయ్ ప్రధాన కార్యదర్శిగా, ఉప్పుల శం కర్ యువజన అధ్యక్షుడిగా, పెండ్యాల సంపత్‌రెడ్డి గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. ఉపాధ్యక్షులుగా గాధగోని శ్రీనివాస్‌గౌడ్, ఉప్పరపల్లి తిరుపతి, సలహాదారులుగా బొమ్మ గాని అంజన్న, అలువోజు కుమార్‌స్వామి, సోషల్ మీడియా బాధ్యతలకు కొండబత్తిని శివకృష్ణ, మం డల కమిటీ సభ్యుడిగా తాడూరి బిక్షపతి, యువజన కమిటీ సభ్యుడిగా మాందాటి హరికృ ష్ణరెడ్డి ఎన్నికయ్యారు.నూతన కమిటీ సభ్యులు గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేస్తామని పేర్కొన్నారు.కమిటీ ఎన్నికతో పందిల్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్, గోదాంగడ్డ ప్రాంతాల్లో మిలాద్ ఉన్ నబీ పండుగ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి.జైబూన్ యూత్ క్లబ్, ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జైబూన్ యూత్ క్లబ్ సభ్యులు హమీద్, అబ్దుల్ సువాన్, తాహెర్, అయాన్, అజ్జు, అక్తర్, సమీర్, అలాగే ఆదర్శ యూత్ క్లబ్ సభ్యులు వసీం అక్రమ్, ఇమ్రాన్, అస్లాం, ఉస్మాన్, షేక్ ఇర్ఫాన్, షేక్ జిలాని, సాజిద్, సలీం, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు



**గన్నేరువరం, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** 2008--09 పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ తోటి మిత్రుడు కోల మద్ది సతీష్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకోవ డంతో దిగ్భ్రాంతి చెందారు.సతీష్ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించిన 60 మంది మిత్రులు కలిసి రూ.50,000 సేకరించి, ఆ మొత్తాన్ని ఆయన కుమార్తె పేరుతో సుకన్య సమృద్ధి ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.స్నేహం అంటే కేవలం వినోదం మాత్రమే కాకుండా, కష్టసమయంలో తోడుగా నిలవడం అని వారు నిరూపించారు. సతీష్ కుటుంబానికి పెద్దకొడుకుల్లా మారి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

## సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పెద్దపల్లి, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలో రూ.15 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు బుధవారం ప్రారంభిం చారు. అలాగే గుడిసెలేని తెలంగాణ కార్యక్ర మంలో భాగంగా 24 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.

## ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు



**నందికొట్కూరు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు నందికొట్కూరులో ఘనంగా జరిగాయి. కేజీఎన్ స్టైల్స్ అండ్ గ్రానైట్ అధినేత సయ్యద్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో కేజీఎన్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ శాంతి, ప్రేమ, సహనం, త్యాగం, సేవ మార్గంలో జీవించాలనే అల్లాహ్ సందేశాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ పండుగను గత మూడు సంవత్సరాలుగా పేదలకు అన్నదానం నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.ప్రతి ఒక్కరు సేవాగుణంతో కులమతాలకు అతీతంగా పేదలకు అండగా నిలవాలని, అన్నదానం, ఆర్థిక సహాయం అందించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ముస్లిం ప్రవర్తలు, సోదరులు, ఇతర మతస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ



**నందికొట్కూరు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మిడుతూరు మండలం చింత లపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థా పకుడు, యుగపురుషుడు స్వర్గీయ నంద మూరి తారకరామారావు విగ్రహాన్ని ఆవిష్కరి ంచారు.గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ముఖ్య అతిథులుగా హాజం య్యారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆశయాలు, ప్రజాసేవా భావనను స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెంక టేశ్వర రెడ్డి, మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, సర్వోత్తమ్ రెడ్డి, మోహన్ రెడ్డి, మహేష్ రెడ్డి, జాకీర్, రవీం ద్రబాబు, శివరామిరెడ్డి, మనోహర్ రెడ్డి, సుధా కర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివా సులు, పరమేశ్వర్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో గాయపడిన పారిశుధ్య కార్మికుడిని పరామర్శించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**వెల్దండ, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు శ్రీరాములు ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సంద ర్భంగా శ్రీరాములు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న రాఘవేందర్ రెడ్డి, చికిత్సకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. శ్రీరా ములు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబానికి అవసరమైన సహాయ సహ కారాలు అంది స్తామని భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పోలె వెంకటేష్, కుమార్, రాములు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు కొండల్ యాదవ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం



**– మాడుగుల జయరామ్‌కు రూ.10 వేల అందజేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి**

**రాచూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రా మానికి చెందిన మాడుగుల జయరామ్ ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటి నిర్మాణాన్ని కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్న జయరామ్‌కు తన వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అంది ంచారు.ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయ సహకారాలు అందిం చేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలి పారు. పేదల సమస్యలను తన దృష్టికి వచ్చిన మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానని, అవసరమైన వారికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ నా గులు నాయక్, మాజీ సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సూరమల్ల సుభాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**– శాంతి, సోదరభావంతో జీవించడమే ప్రవక్త బోధనల సారాంశం: మత గురువులు**



**ఆమనగల్లు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జామా మస్జిద్, మహ్మదీయ మస్జిద్, మస్జిదే హిలాల్‌లను విద్యుత్ దీపా లతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు, దువాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు అబ్దుల్ వాహిద్, లతీఫ్ మా ట్లాడుతూ మానవులంతా ఒక్కటేనని, కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా శాంతి, సోదరభావం, దానం, దైవభీతితో జీవిం చాలని మహ్మద్ ప్రవక్త బోధించారని తెలి పారు. సమాజంలో శాంతి, సామరస్యం నెల కొల్పడంతో పాటు సర్వ మానవాళి శ్రేయస్సు కోసం ప్రవక్త చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. మహ్మద్ ప్రవక్త జీవిత విధానం, బోధనలు, సూక్తులను బయాన్ ద్వారా ముస్లిం సోదరులకు వివరించారు. ప్రవక్త బోధించిన సన్మార్గంలో నడవడం ద్వారా సమాజంలో ప్రేమ, ఐక్యత, మానవతా విలువలు మరింత బలపడ తాయని అన్నారు. అనంతరం ఆయా మస్జిద్‌లలో ప్రత్యేక దువా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో జన సందోహం

**– ఆమనగల్లులో వైభవంగా భారీ ర్యాలీ.. అలరించిన ఖాబా షరీఫ్ నమూనా**



**ఆమనగల్లు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిం చారు. పట్టణంలోని మస్జిద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు, దువాలు నిర్వహించి జాగరణ చేపట్టారు. అనంతరం ముస్లిం మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాన రహదారిపై 'నారే తక్బీర్.. అల్లాహు అక్బర్' అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలోని పలు వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మక్కా--మదీనా, ఖాబా షరీఫ్ నమూనాల ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా ఎలా ంటి అవాంఛనీయ ఘటనలు చోటుచే సుకోకుండా సీఐ ఎస్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీ సులు పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, కౌన్సిలర్లు మొక్తల వెంక టయ్య, పాపిశెట్టి రాము, నాగిళ్ల జగన్, ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## చిరుజల్లుల వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు



**ఖానాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బుధవారం సాయంత్రం ఖానాపూర్ మండల కేంద్రంలో మోస్తరు వర్షం కురిసింది. చిరుజ ల్లులు కాకుండా ఎక్కువ జల్లులు రావడంతో రహదారులు బురదమయమై పాదాచారులు, వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొ న్నారు.సంత రోజు కావడంతో మార్కెట్‌లో కూరగాయలు అమ్మేవారు, కొనుగోలుదారులు వర్షంలో తడిసి ఇబ్బందులు పడ్డారు. మొత్తంగా వర్షం కారణంగా ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

## నగరంలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రవక్త మహ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి.హుస్సేనీపురలోని బొంబాయి స్కూల్‌లో ఆసారే ముబారక్ దర్శనం అనం తరం మర్కజి మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి కరిముల్లాహ్ షా దర్గాహ్ వద్ద ముగిసింది.మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఫరీదా బాబా, ప్రధాన కార్యదర్శి గులాం రబ్బాని ఖాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం హిందూ--ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రవక్త మహ్మద్ చూపిన శాంతి, ప్రేమ, సోదరభావం మానవతా విలువల బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నగరంలో శాంతియుత వాతావరణంలో వేడుకలు జరిగి, మతపెద్దలు, నాయకులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీకగా మిలాద్ ఉన్ నబీ



**పెద్దపల్లి, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జష్నే ఈ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పెద్దపల్లి పట్టణంలో మైనార్టీలు నిర్వహించిన ర్యాలీలో జ్యూస్ బాటిళ్లను పంపిణీ చేశారు.కార్యక్రమానికి 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్ ముఖ్య అతిథిగా హాజరై, పెద్దపల్లి పట్టణం మతసా మరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, హిందూ--ముస్లిం సోదరులు అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఐకమత్యం, సోదరభావం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్‌కుమార్, మెహరాజ్, కొలిపాక కృష్ణ, షఫీ, కుక్క అశోక్, నూనె వెంకటేష్, వేల్పుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి మిట్టపల్లి వెంకటేష్



**పెద్దపల్లి, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అసెంబ్లీ, జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి మిట్టపల్లి వెంకటేష్ సూచించారు. బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావు క్యాంపు కార్యాలయంలో జరిగిన జిల్లా యువజన కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్, అసెంబ్లీ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్, చీమల సందీప్, రాష్ట్ర కార్యదర్శి మధుకర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రౌతు మనోజ్‌కుమార్, గుమ్మడి ప్రసాద్, పిరంగి రాజు, ఉపాధ్యక్షుడు ఎంచర్ల తిరుమలేశ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రవణ్, మండల అధ్యక్షులు జడల రాజు, సిరిసెటి రాహుల్, ఒర్రె అజయ్ యాదవ్, దేవేందర్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ వేడుకలు



**పెద్దపల్లి, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు పెద్దపల్లిలో ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి.సీనియర్ నాయకురాలు సిరవేన స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి సలేంద్ర కొమురయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, వ్యాన్ అసోసియేషన్, మానసిక వికలాంగుల స్ఫూర్తి కేంద్రంలో విద్యార్థులకు, సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.సిరవేన స్వప్న మాట్లాడుతూ "ఆడబిడ్డగా ప్రతి అన్నదమ్ముడికి అండగా ఉంటాను, రక్షణగా నిలుస్తాను" అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రతి గ్రామంలో "అన్నా.. నీకు నేనున్నా" అనే భావనను చాటేలా ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొంగోని శంకర్ గౌడ్, సిరిపురం శారదా, దాసరి సౌమ్య, మల్యాల కరుణాకర్, బొడిగె మహేష్, ఎంచెర్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాజు రా రోడ్డులో ఇరుక్కుపోయిన బస్సు, లారీ



**ఖానాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని దిమ్మదుర్తి--రాజు రా గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సు, లారీ ఇరుక్కుపో వడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డు వెడల్పు లేకపోవడంతో రెండు వాహనాలు పక్కపక్కనే ఇరుక్కుపోయి దాదాపు 45 నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వర్షం కారణంగా రోడ్డు పక్కన భూమి బురదగా ఉండటంతో వాహనాలు దిగి వెళ్లే పరిస్థితి లేకపోయింది.ప్రజలు మాట్లాడుతూ రోడ్డు వెడల్పు లేకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని, ఇకనైనా అధికారులు రోడ్డును విస్తరించాలని కోరారు.

## ఘనంగా ఓనం పండుగ వేడుకలు



ఖానాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఖానాపూర్ పట్టణంలో కేరళకు చెందిన సభ్యులు ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు.కేరళ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాబు ఇంటిలో జరిగిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు వేడుమ బొజ్జు పటేల్, కౌన్సిలర్లు, నాయకులు, బంధుమిత్రులు హాజరయ్యారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జ్యోతి ప్రజ్వలన చేసి పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబు, మహిళలు ఓనం పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానం చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రాజుర సత్యం, నిమ్మల రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగిల్ శంకర్, జహీర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మట్టేది రాజశేఖర్, లాయర్ కిషోర్, కేరళ బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ఘనంగా చలో సెక్రటేరియట్ పోస్టర్ ఆవిష్కరణ



హుస్నాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఆగస్టు 31న నిర్వహించనున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరే కిషోర్ మాట్లాడుతూ మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని, రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత విధానం కారణంగా మాలలకు రావాల్సిన అవకాశాలు తగ్గిపోతున్నాయని, ప్రతి నియామకంలో పారదర్శకంగా రోస్టర్ పాయింట్లను ప్రకటించాలని కోరారు.కార్యక్రమ ముఖ్య అతిథి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆగస్టు 31న జరిగే చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జాల శ్రీనివాస్, బందెల హరీష్, దుండ్ర సుమన్, బత్తుల మల్లికార్జున్, సావుల చంద్రయ్య, వేరంగి సాయి పరమేష్, వెన్న కనుకయ్య, మామిడి నాగరాజు, మామిడి బాబు
తదితర మాల కుల బాంధవులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలు అబద్ధం పుట్ట మధూకర్




పెద్దపల్లి, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌గా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలు అబద్ధమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు.బుధవారం సిరిపురం గ్రామంలోని సుందిళ్ల బరాజ్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, వాటర్ పవర్ సెంట్రల్ రీసెర్చ్ స్టేషన్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలు కాంగ్రెస్ ఆరోపణలను ఖండించాయని తెలిపారు. కేసీఆర్ ముందుచూపుతోనే తెలంగాణ దేశానికి దిక్సూచి అయిందని అన్నారు. రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలని చూశారని విమర్శించారు. తండ్రి--కొడుకుల పాలనలో ఒక్క చెక్‌డ్యాం, బ్రిడ్జి కూడా కట్టలేదని, కేసీఆర్ హయాంలో చెక్‌డ్యాంలు, బ్రిడ్జిలు నిర్మించామని గుర్తు చేశారు.ప్రాజెక్టు వల్ల మత్స్య సంపద, సాగు విస్తీర్ణం పెరిగి వలసలు తగ్గాయని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ వలసలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బరాజ్ గేట్లు మూసి నీటిని నిల్వ చేయాలని, లేనిపక్షంలో ప్రజలే నీళ్లు ఆపుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

## మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, సీపీ



కరీంనగర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రవక్త మహ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుకునే పవిత్రమైన మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రవక్త మహ్మద్ ప్రపంచానికి ప్రేమ, దయ, కరుణ, సహనం, సోదరభావం వంటి విలువలను బోధించారని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలంతా సోదరభావంతో మెలగాలని, శాంతి, ఐక్యతను కాపాడుతూ దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం నింపాలని ఆకాంక్షించారు.

## అల్ఫోర్స్ బాలుర జూనియర్ కళాశాలలో ఘనంగా "త్రాలాల" ఫ్రెషర్స్ డే






కరీంనగర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో త్రాలాల పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని కృషి చేస్తే ఒత్తిడి తగ్గి చదువులో శ్రద్ధ పెరిగి విజయాలను సాధించగలరని సూచించారు. ఆయన మాట్లాడుతూ, అల్ఫోర్స్ విద్యార్థులు దేశ--విదేశాల్లో గుర్తింపు పొందిన స్థానాల్లో స్థిరపడటం సంస్థ కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ప్రత్యేకంగా నరసింహస్వామి కాన్సెప్ట్, రామ్ సియారామ్ జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైసిగండిలో వైభవంగా తీజ్ వేడుకలు

**– గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా భారీగా తరలివచ్చిన ప్రజలు**

ఆమనగల్లు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ వేడుకలు బుధవారం కడ్తాల మండలం మైసిగండిలో వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మైసిగండి జనసంద్రంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. పార్టీలకతీతంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు,



ప్రజాప్రతినిధులు వేడుకలకు హాజరయ్యారు. గిరిజన యువతులు సంప్రదాయంగా తీజ్ మొలకలను ప్రజాప్రతినిధులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించిన అనంతరం మొలకెత్తిన తీజ్ బుట్టలను ఆలయంలో ఉంచారు. పెళ్లికాని యువతులు, చిన్నారులు పట్టు వస్త్రాలు ధరించి డీజే సౌండ్‌లకు గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తూ అలరించారు. యువతీయువకుల నృత్యాలు, సంప్రదాయ కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, ఆర్.పి. జ్యోతి, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బీక్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, చెగురి వెంకటేష్, మండల అధ్యక్షుడు శంకర్, సర్పంచులు ప్రేమ జవహర్‌లాల్ నాయక్, రాయికంటి బిక్షపతి, మహేందర్‌గౌడ్, డిగ్రీ కృష్ణ, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి గోలి శ్రీనివాస్ రెడ్డి చేయూత

**– జయరామ్ ఇంటి నిర్మాణానికి రూ.10 వేల ఆర్థిక సాయం**

ఆమనగల్లు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాచూర్ గ్రామానికి చెందిన మాడుగుల జయరామ్ ఇంటి నిర్మాణానికి ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి బుధవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణాన్ని కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న జయరామ్‌కు తన వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందజేశారు. పేద కుటుంబానికి ఇంటి నిర్మాణ సమయంలో ఆర్థిక చేయూత అందించడం ద్వారా గోలి శ్రీనివాస్ రెడ్డి మానవతా దృక్పథాన్ని



చాటుకున్నారు. గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలిచి, అవసరమైన సమయంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి సాధ్యమైనంత మేరకు సహాయం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన గోలి శ్రీనివాస్ రెడ్డికి మాడుగుల జయరామ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ నాగులు నాయక్, మాజీ సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సూరమల్ల సుభాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఆదర్శం ఎల్.ఎన్.రెడ్డి

**– అమెరికా ఆటా పర్యటన విజయవంతం.. ఘనంగా సన్మానం**

ఆమనగల్లు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమెరికాలో జరిగిన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) వేడుకల్లో పాల్గొని విజయవంతంగా తిరిగి వచ్చిన రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి (ఎల్.ఎన్.రెడ్డి)కి కడ్తాల్ మండల కేంద్రంలో ఘన సన్మానం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎల్.ఎన్.రెడ్డిని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. కడ్తాల్ సర్పంచ్‌గా కేసీఆర్ నాయకత్వంలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి జాతీయ స్థాయిలో కడ్తాల్‌కు గుర్తింపు తీసుకురావడంలో ఎల్.ఎన్.రెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. విదేశాల్లో స్థిరపడినప్పటికీ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ స్వగ్రామం, ప్రాంత అభివృద్ధికి సేవలందించడం స్ఫూర్తిదాయకమన్నారు. అమెరికాలో జరిగిన ఆటా వేడుకల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ ఆయన వ్యవహరించిన తీరు గర్వకారణమన్నారు. ఆటా సౌజన్యంతో రెండేళ్లకోసారి మన



ప్రాంతంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి తిరిగి సేవ చేయాలనే తపన కలిగిన ఎల్.ఎన్.రెడ్డి నేటి యువతకు నిజమైన ఆదర్శప్రాయుడని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలుగు ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్మాస్‌పల్లి, నార్లకుంట తండా, రావిచెడ్ సర్పంచులు గోపాల్, శ్రీనునాయక్, రామచందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు లచిరామ్ నాయక్, మంజుల చంద్రమౌళి, మాజీ సర్పంచ్ యాదయ్య, బూనాథ్, ఉపసర్పంచులు పాండునాయక్, రమణనాయక్, ముత్యాలు, వార్డు సభ్యులు గణేష్‌గౌడ్, రవినాయక్, బీఆర్‌ఎస్ నాయకులు గంప శ్రీనివాస్, లయక్ అలీ, మంగలపల్లి నర్సింహ, డా. రాజు, సతీష్, గురిగళ్ల రామచంద్రయ్య, మూఢ అశోక్, రాఘవరెడ్డి, జంగయ్య, పుట్టి శ్రీను, దాసు, మహేష్, వెంకటేష్, అంజి, పాండు, గోపాల్, లింగం, చేగురి రాములు, కుమ్మరి శ్రీశైలం, కొంగళ్ల అంజయ్య, సత్యం, వకీల్ యాదయ్య, కర్కల్‌పహాడ్ యాదయ్య, మహేష్, ఊఎందర్, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

కల్వకుర్తి, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :కల్వకుర్తి పట్టణంలో మిలాద్ ఉన్ నబీ పండుగ వేడుకలు మతసామరస్యానికి నిదర్శనంగా ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి పట్టణంలోని ప్రధాన మస్జీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, బుధవారం అల్విజాన్ మస్జీద్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ భృంగి ఆనంద్ కుమార్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్ ప్రారంభించారు.రక్తదాన శిబిరంలో 45



మంది యువకులు, పెద్దలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. హిందూ--ముస్లిం సోదరులు కలిసి పాల్గొనడం విశేషమని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. సేకరించిన రక్తాన్ని జిల్లా ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు.వేడుకల సందర్భంగా డీఎస్పీ సయి రెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ నాజియా మక్బూల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ మసూద్, రమాకాంత్ రెడ్డి, సోఫీ, ఇంతియాజ్ ఖాన్, తయ్యబ్ అలీ, ఆరీఫ్, సాజిద్, దున్న సురేష్, నవీన్, మస్జీద్ కమిటీ అధ్యక్షులు, ఇమామ్‌లు, మౌలానాలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో చాలా చోట్ల వ్యాప్తి చెందుతున్న హెచ్5ఎన్1

ఇటీవల ప్రపంచంలో చాలా చోట్ల హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. సాధారణ జలుబు, ఫ్లూ లక్షణాల్లాగే ప్రారంభమయ్యే ఈ వైరస్ సంక్రమణ అరుదుగా మనుషులకు కూడా సోకే అవకాశం ఉంటుంది. అయితే మనుషుల మధ్య వ్యాప్తి చాలా అరుదుగా జరుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి సోకిన పక్షులతో సన్నిహితంగా ఉండేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రారంభ లక్షణాలను గుర్తించడం, ప్రమాదంలో ఉన్నవారు ఎవరో తెలుసుకోవడం, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్ ముప్పును తగ్గించుకోవచ్చు. హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ అంటే ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లో ఒక రకం. ఇది ప్రధానంగా వ్యాధి సోకిన పక్షులు, కోళ్లు, వాటి విసర్జనలు లేదా లాలాజలంతో సన్నిహితంగా ఉండటం ద్వారా వ్యాపిస్తుంది. కలుషితమైన పరిసరాలు, పౌల్ట్రీ ఫారాలు, లైవ్ బర్డ్ మార్కెట్ల ద్వారా కూడా వైరస్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. అరుదైన సందర్భాల్లో మనుషులకు, ఇతర జంతువులకు కూడా ఈ వైరస్ సోకుతుంది.లక్షణాలు ఏమిటి..వైరస్ సోకిన పక్షులతో సన్నిహితంగా మెలిగిన తర్వాత హెచ్5ఎన్1 లక్షణాలు కనిపిస్తాయి. ప్రారంభ దశలో జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం, నీరసం, తలనొప్పి, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి సాధారణ జలుబు లేదా ఫ్లూ లక్షణాలను పోలి ఉండడంతో వైరస్‌ను ప్రారంభంలో గుర్తించడం కొంత కష్టంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఇన్ఫెక్షన్ తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఊపిరి అందకపోవడం, ఛాతిలో నొప్పి, న్యుమోనియా, తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం తీసుకోవడం అవసరం. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తగ్గకుండా కొనసాగుతున్న అధిక జ్వరం లేదా శ్వాసకోశ లక్షణాలు మరింత తీవ్రమవుతుంటే




వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. హెచ్5ఎన్1 ఇన్ఫెక్షన్ కొన్ని సందర్భాల్లో వేగంగా తీవ్రతరం అవుతుందని ఆరోగ్య అధికారులు హెచ్చరిస్తున్నారు. పక్షులతో నిత్యం సన్నిహితంగా పనిచేసే వారికి హెచ్5ఎన్1 ముప్పు ఎక్కువగా ఉంటుంది. పౌల్ట్రీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పశువైద్యులు, లైవ్ బర్డ్ మార్కెట్‌లో పనిచేసేవారు, జంతు సంరక్షణ సిబ్బంది, అనారోగ్యంతో ఉన్న లేదా చనిపోయిన పక్షులను నిర్వహించే వ్యక్తులు ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు కూడా మరింత అప్రమత్తంగా ఉండాలి.
ఏం చేయాలి..అనారోగ్యంతో ఉన్న లేదా చనిపోయిన పక్షి కనిపించినప్పుడు దానిని చేతులతో నేరుగా తాకకూడదు. వీలైనంత త్వరగా సంబంధిత స్థానిక అధికారులకు సమాచారం అందించాలి. పెంపుడు జంతువులను కూడా అలాంటి పక్షులకు దూరంగా ఉంచడం మంచిది. పక్షులతో లేదా వాటి పరిసరాలతో సంబంధం ఏర్పడిన తర్వాత చేతులను సబ్బుతో పూర్తిగా శుభ్రం చేసుకోవాలి. పక్షులను నిర్వహించాల్సిన పరిస్థితుల్లో తగిన రక్షణ పరికరాలను ఉపయోగించడం ద్వారా వైరస్‌కు గురయ్యే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. కలుషితమైన ఉపరితలాలను కూడా జాగ్రత్తగా శుభ్రం చేయాలి. అనారోగ్యంతో ఉన్న పక్షులతో సంబంధం ఏర్పడిన తర్వాత ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ ఉండటం కూడా ముఖ్యమే. బర్డ్ ఫ్లూ వ్యాప్తి సమయంలో చికెన్, గుడ్లు తినడం పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే వాటిని పూర్తిగా ఉడికించి మాత్రమే తినాలి. సంబంధిత ఆరోగ్య అధికారులు వాటిని వినియోగానికి అనుమతించినవేనని నిర్ధారించుకోవడం అవసరం. పచ్చిగా లేదా సరిగా ఉడికించని చికెన్, గుడ్లు, ఇతర పౌల్ట్రీ ఉత్పత్తులను మాత్రం తీసుకోకూడదు.ముప్పును ఎలా తగ్గించుకోవాలి..చికెన్, గుడ్లను పూర్తిగా ఉడికించడం ద్వారా హెచ్5ఎన్1 వైరస్‌కు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. పౌల్ట్రీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, వండడం వంటి ప్రతి దశలోనూ పరిశుభ్రత పాటించడం ముఖ్యం. అనుమా నాస్పదంగా ఉన్న లేదా ఆరోగ్య అధికారులు జరుగుతుంది.

# సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ ప్రారంభించిన ఎస్పీ సునీల్ షోరాణ్



**నంద్యాల, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నంద్యాల పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌ను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలోని పాత జిల్లాల్లో విజయవంతంగా నడుస్తున్న క్యాంటీన్ సేవలను కొత్త జిల్లాల్లోనూ విస్తరించామని తెలిపారు. మార్కెట్ ధరల కంటే తక్కువ రేట్లకు నాణ్యమైన నిత్యావసరాలు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అవసరమైన వస్తువులు స్టాక్‌లో లేకపోతే ముందస్తు రిక్వెస్ట్ ఆధారంగా తెప్పించే సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాషా, చిన్నికృష్ణ, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, పోలీస్ వెల్ఫేర్ ఆర్ఐ విజయనరసింహ, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి నాయక్, ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగా వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



**పాములపాడు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పాములపాడు మండలంలోని మద్దూరు గ్రామంలో బుధవారం గంగమ్మ విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. మద్దూరు, కృష్ణానగర్, పెంచికలపల్లె గ్రామాల్లో విగ్రహ ప్రతిష్టకు ముందు సన్నాయి మేళాలతో, వేదమంత్రాల నడుమ ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం నీటి సంఘం చైర్మన్ జి. తిమ్మారెడ్డి దంపతులు, గ్రామ ప్రజలతో కలిసి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు జి. తిమ్మారెడ్డి మాట్లాడుతూ రైతుల పంటలు, పాడిపశువులు నీటి ఎద్దడి లేకుండా గంగమ్మ తల్లి దీవెనలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# రూ.37 లక్షలతో మార్కెట్ యార్డ్ భవనాల పునరుద్ధరణ



**నందికొట్కూరు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో శిథిలావస్థకు చేరిన భవనాలు, గోడలు, పైకప్పులు, కార్యాలయ భవనం, విశ్రాంతి భవనాన్ని రూ.37 లక్షల వ్యయంతో పునరుద్ధరించారు. పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌ను ఆధునిక వసతులతో అభివృద్ధి చేయడం ద్వారా రైతులు, వ్యాపారులు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఇది మరో ముందడుగు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, మండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుసేన్, జి. రవీంద్రరెడ్డి, వాడాల జనార్దన్ రెడ్డి, మహిళా నాయకులు డాక్టర్ డి. వనజ, డాక్టర్ మీనాక్షి దేవి, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్ ప్రారంభించిన గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు



**నందికొట్కూరు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్ ను సామాజికవేత్త గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు అభివృద్ధి చెందడం ద్వారా రైతులు, వ్యాపారులకు ఉపయోగ పడతాయని, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొం తల పద్మనాభయ్య గుప్తా, బొంతల సురేష్ గుప్తా బ్రదర్స్, పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రము ఖులు దొంతుల స్వామన్న, దొడ్డ సుధాకర్, మహానంది రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు



**ఆత్మకూరు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆసార్ మసీదులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ వేడుకల్లో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు, సందేశాలను స్మరించుకున్నారు. మత పెద్దలు శాంతి, సోదరభావం, ఐక్యత, మానవతా విలువల ప్రాధాన్యతను వివరించి, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మౌలానా మహమ్మద్ గౌస్, ఆసార్ మాలిక్, బట్టల సుల్తాన్, ఫ్రూట్ కరీముల్లా, అమ్రుల్లా, లాలు, మాజీ కౌన్సిలర్ కలిముల్లా, హబీబ్, సయ్యద్ గౌస్, అశోక్, ఇర్ఫాన్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్ అవగాహన సదస్సు నిర్వహణ



**నందికొట్కూరు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచనలతో నందికొట్కూరు సర్కిల్ శక్తి టీం బిజీనేవేముల గ్రామంలో మహిళలకు, ప్రజలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించింది. ఏఎస్ఐ ఎస్. ఖాదర్ బాషా, పీసీ రసూల్ శక్తి వాట్సాప్ నంబర్ 7993485111, అత్యవసర నంబర్లు 112, 100, 181, 1098, 1930 ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల భద్రత, అలవాట్లు, ప్రవర్తన విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ మొబైల్‌లో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి కన్నీటి వీడ్కోలు



**షాద్‌నగర్, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాఖీ పండుగ సమీపిస్తున్న వేళ జమాల్పూర్ నవీన్ విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. అన్నను కోల్పోయిన చెల్లెలు పూజిత కన్నీటి పర్యంతమై, రాఖీ పండుగ సందర్భంగా అన్న చేతికి కట్టాల్సిన రాఖీని చివరిసారిగా మృతదేహానికి కట్టింది. "అన్నా.. నిన్ను ఇక ఎప్పటికీ చూడలేనా" అంటూ విలపించిన ఆమె రోదన అక్కడున్న వారిని కదిలించింది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగకు ముందు చోటుచేసుకున్న ఈ ఘటనతో బంధువులు, స్థానికులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు.

# బోనాల ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



**- నేటి నుంచి ఉత్సవాలు.. ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్ పత్య నాయక్**

**ఆమనగల్లు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీలో నేటి నుంచి ప్రారంభం కానున్న బోనాల ఉత్సవాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు మొక్తల వెంకటయ్య, ఏనుమల్ల రమేష్, ఎర్రవోలు మహేష్, అనుష శ్రీశైలం, కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్, మున్సిపల్ సిబ్బంది రామకృష్ణ, స్థానిక నాయకులు కలిసి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు చైర్మన్ పత్య నాయక్ తెలిపారు. బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ఆలయాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బోనాల వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని చైర్మన్ తెలిపారు.

## వెల్జాల్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

**- భక్తిశ్రద్ధలతో ర్యాలీ.. దర్గాలో ఫతేహాలు, అన్నదానం**



**ఆమనగల్లు, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జామా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు ఎం.డి. సయీద్ ఆధ్వర్యంలో గ్రామంలోని ముస్లిం యువకులు భారీ ర్యాలీ నిర్వహించి మహబూబ్ సుభాని దర్గాకు చేరుకున్నారు. అక్కడ దర్గాకు పూలు సమర్పించి ఫతేహాలు నిర్వహించారు. అనంతరం జామా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్ ఇమామ్ మహ్మద్ ఇంతియాజ్ ఖాద్రి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్తను ప్రతి ముస్లిం గౌరవంతో స్మరించుకోవాలని తెలిపారు. ప్రవక్త పేరు ఉచ్చరించినప్పుడు, రాసినప్పుడు గౌరవ సూచకంగా 'సల్లల్లాహు అలైహి వసల్లం' అని పలకాలని సూచించారు. ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో పాటించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు అజీజ్, ఆరిఫ్, రషీద్, సుభాన్, నయీం, ఖాజా మైనుద్దీన్, గౌస్, ఖదీర్, యూసుఫ్, రఫీక్, జాఫర్, ఖవిజానీ, రహీం, సైదులు, అఖిల్, అక్బర్, అలీమ్, జానీ, నఫీర్, చోటు, భాయం ఖురేషీ, రహీం ఖురేషీ, హమీద్, అబ్దుల్ ఖయ్యూం, అసిఫ్, ఇమ్రాన్, సోహన్, సోహెల్, ఆఫ్తాబ్, భారి తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఉ టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నియోజకవర్గ పర్యటనలో భాగంగా పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మన్నెగూడలో బొమ్మిడేక శేఖర్ రెడ్డి కుమార్తె వివాహం, ఆమనగల్ మండలం కోనాపూర్ గ్రామం ఆకిటి యాదయ్య కుమార్తె వివాహం, శెట్టిపల్లి గ్రామం కొమ్ము సంజీవ వివాహం, సుద్దకల్ గ్రామం గోరెంట్ల నరేష్ యాదవ్ వివాహం, కల్వకుర్తి బొమ్మకూరి జగదీశ్వర్ కుమార్తె వివాహం వంటి వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు శివ, భాస్కర్, సత్యం, నరసింహ, జలెంధర్, కృష్ణయ్య, మహేష్, మల్లేష్, సందీప్, ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్, కొండల్ యాదవ్, చంద్రశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వృద్ధులపై ప్రభావం.. భవిష్యత్తులో తట్టుకోలేని స్థితికి..



వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వృద్ధుల ఆరోగ్యంపై చూపించే ప్రభావం ఇప్పటివరకు అంచనా వేసిన దానికంటే చాలా ఎక్కువగా ఉంటుందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తీవ్రమైన వేడి పరిస్థితులు వారి ఆరోగ్యానికి మరింత పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుల నేతృత్వంలో ఈ అధ్యయనం జరిగింది. వాతావరణ మార్పుల కారణంగా భవిష్యత్తులో ఎంత తరచూ ఉష్ణోగ్రతలు వృద్ధుల శరీరం తట్టుకోలేని స్థాయికి చేరుకోవచ్చో అంచనా వేయడానికి పరిశోధకులు ప్రయత్నించారు. ఈ పరిశోధన ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ లో ప్రచురితమైంది. ఇప్పటివరకు తీవ్రమైన వేడి మనుషుల శరీరంపై చూపే ప్రభావాన్ని అంచనా వేయడానికి వెట్-బల్బ్ టెంపరేచర్ అనే కొలమానాన్ని ఎక్కువగా ఉపయోగించారు. ఇందులో ఉష్ణోగ్రతతో పాటు గాలిలోని తేమను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అయితే గతంలో జరిగిన కొన్ని పరిశోధనలు ప్రధానంగా యువకులు, ఆరోగ్యంగా ఉన్న పెద్దలపై నిర్వహించిన ప్రయోగాల ఆధారంగా ఉన్నాయి. అందువల్ల వృద్ధులపై వేడి చూపే అధిక ప్రభావం అందులో పూర్తిగా ప్రతిబింబించలేదని తాజా అధ్యయనం పేర్కొంది. రాను రాను వేడిని తట్టుకోలేరు..వయసు పెరిగే కొద్దీ శరీరం వేడిని తట్టుకునే సామర్థ్యం తగ్గుతుంది. వృద్ధులు తక్కువగా చెమట పట్టడం, గుండె పనితీరు బలహీనంగా ఉండటం, ఇప్పటికే కొన్ని ఆరోగ్య సమస్యలు ఉండటం వంటి కారణాల వల్ల తీవ్రమైన వేడికి మరింత సున్నితంగా మారుతారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఉంటుంది.

## ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఓదెల, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రముఖ పుణ్యక్షేత్రం ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన, దాతల సహకారంతో నిర్మించనున్న 22 వసతి గృహాల సముదాయానికి భూమిపూజ చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి రూ.15 కోట్లు, రోడ్లు మరియు ఇతర పనులకు రూ.1.30 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. నూతన గోపురాలు, రాతి శిల్పాలతో ప్రాకారం నిర్మించి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ నుంచి మరో రూ.8 కోట్ల నిధులు మంజూరు కానున్నాయని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని మౌ లిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, ఈఓ, స్థానిక సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**కరీంనగర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్--2013, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనలో భాగంగా పేద ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. పదవ డివిజన్ కార్పొరేటర్ సౌగాని కొమురయ్య ఆధ్వర్యంలో ఈరోజు కార్డులను లబ్ధిదారులకు అందజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఓడితల ప్రణవ్



**కమలాపూర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గూడూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఓడితల ప్రణవ్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీ ందర్, మండల అధ్యక్షుడు వాసాల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, మాజీ ఎంపీపీ తడక శ్రీకాంత్, నాయకులు పాక చంద్రమౌళి, భాష బోయిన రమేష్, గాలిబు నవీన్, కొండపాక మనీష్, ఎర్రగొల్ల రాజు, గూడూరు గ్రామ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు మూసివేయాలని సమయం తీసుకున్న గ్రామస్తులు




**సుల్తానాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో కొనసాగుతున్న బెల్ట్ షాపులను మూసివేయాలని గ్రామ పాలకవర్గం నిర్ణయించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో బెల్ట్ షాపుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, యువతకు ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలు కాపాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ కంపెల్లి సతీష్ కుమార్ తెలిపారు. గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు పాలకవర్గం ఈ నిర్ణయం తీసుకుందని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా మేయర్ కోలగాని శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మేయర్ కోలగాని శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించగా, వెంకటాద్రి హాస్పిటల్ డాక్టర్ టి. కార్తీక్ బృందం ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందించారు. లయన్స్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించి లబ్ధిదారులకు పరీక్షలు చేశారు. అవసరంలో ఉన్న రోగులకు శేషాద్రి ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ సహకారంతో ఉచిత మందులు పంపిణీ చేశారు. మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా నిరుపేదలకు భోజనం అందించారు. ఈ వేడుకలు ఆరోగ్య సంరక్షణ, ఆకలి నివారణ, మానవతా సేవలతో కూడిన రోజుగా నిలిచాయి. కార్యక్రమంలో లయన్ మ్యాడం శివకాంత్ పటేల్, లయన్ చిదుర సురేష్, లయన్ బట్టు వినోద్, లయన్ మెతుకు కృష్ణ చైతన్య, లయన్ ముక్క శరత్ కృష్ణ, లయన్ కంభం ప్రసాద్, లయన్ ఐత సూరజ్, లయన్ డాక్టర్ కార్తీక్, లయన్ కొండ రాంబాబు, లయన్ పాత నాగేశ్ పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు మేయర్ కోలగాని శ్రీనివాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన ఆరోగ్యంగా, సంతోషంగా ఉండి సమాజ సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**సుల్తానాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సుల్తానాబాద్ మండలంలోని మంచరామి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన ప్రజలకు కార్డులు అందజేశారు. ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు పాల్గొని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

# వచ్చే నెలలో కొత్త పింఛన్ల మంజూరు! – దరఖాస్తు చేసుకొనేందుకు ఆరు రోజులే గడువు



**హైదరాబాద్ :** తెలంగాణలో చేయూత పథకం కింద కొత్త పిం ఛనుదారుల ఎంపిక ప్రక్రియ వచ్చే నెల నుంచి ప్రారంభం కానుంది. పింఛను దరఖాస్తులకు గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుంది. సెప్టెం బరు 1 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహి ంచాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అన్ని జిల్లాల అధికా రులకు తెలియజేసింది. అర్హత కలిగిన వారంద రికీ పెన్షన్ సాయం అందేలా ఎంపిక చేయాలని అధికారులు భావిస్తున్నారు. తండాలు, గూడేలు, మారు మూల గిరిజన ఎస్సీ కాలనీలు, పట్టణ ప్రాంతా ల్లోని మురికివాడలకు దరఖాస్తుదారుల పై ప్రత్యే క దృష్టి సారించాలని నిర్ణయించింది. మరో 2,00,000 దరఖాస్తులు వస్తాయని అంచనా : కొత్త పెన్షన్ కోసం ఈ నెల 9 నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. మంగళవారం వరకు 3,03,066 మంది అర్జీలు పెట్టుకున్నా రు. ఇంకా ఆరు రోజుల గడువు ఉండగా మరో రెండు లక్షల దరఖాస్తులు వస్తాయని సెర్ప్ అం చనా. 2.5 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ సంస్థ తెలిపి ంది. ఈ మేరకు గ్రామాల్లో పంచాయతీ కార్య దర్శులు, పట్టణాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధి కారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపిక ప్రక్రియలో మహిళా సంఘాల సాయం చేయా లని సెర్ప్ సూచించింది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అధికారుల నివేదికలు మండల, పట్టణాల ద్వారా జిల్లా కలెక్టర్లకు, అక్కడి నుంచి సెర్ప్ ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. వాటిని పరిశీలించి సీఈవో కొత్త లబ్ధిదారులను ఖరారు చేస్తారు. ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ వేగవంతం : చేయూత పింఛను దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేశామని డిప్యూ టీ కమిషనర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ం 25 మంది ఆపరేటర్లతో ఆప్రక్రియలో మహిళా సంఘాల సాయం చేయా న్‌లైన్‌లో ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియను ముమ్మరం చేశామని ఆయన చెప్పారు. ఇప్పటివరకు 2,600 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేశామన్నారు. 1,660 దరఖాస్తులు పరిశీల నలో ఉన్నాయని, విచారణ పూర్తి చేసిన తర్వాత ఎప్పటికప్పుడు దరఖాస్తుదారుల నుంచి అవసర మైన సేకరిస్తున్నామని ఆయన వెల్లడించారు.

# ధరణితోనే అనేక భూ సమస్యలు.. గత ప్రభుత్వంపై వీహెచ్ ఫైర్



**హైదరాబాద్, ఆగస్టు 26:** గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారుడు వి.హను మంతరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. (బుధవారం) గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహి ంచిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకో వడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించా రు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు. ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకోనివచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమ ంతరావు సూచించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు.

# మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం




**హైదరాబాద్ :** మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన గౌరవం దక్కే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మహిళా సమానత్వం అనేది కేవలం ఒక నినాదంగా కాకుండా ఆచరణలో కనిపించాల్సిన అంశమని అన్నారు. మహిళల సాధికారతతోనే ప్రతి కుటుంబం, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాటలకే పరిమితం చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తామని, యువతులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, హామీల అమలులో స్పష్టత లేకపోవడం, పూర్తిగా విస్మరించిన నేపథ్యంలో మహిళలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. గతంలో మహిళల సంక్షేమం, భద్రత, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. మహిళలకు కేవలం పథకాలు ప్రకటించడం కాకుండా వాటిని సమర్థవంతంగా అమలు చేసి, వారి జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

# ఆధారాలు చూపించి ఓటు నిలుపుకోండి

**హనుమకొండ:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి తుది దశ ప్రక్రియ హనుమకొండ జిల్లాలో వేగవం తమైంది. మ్యాపింగ్ కాని వారితో పాటు అనా మలిస్ (స్పష్టమైన గుర్తింపు లేని ఓటర్లు) జాబితాలో చేరిన ఓటర్లకు బీఎల్‌వోల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నారు. జిల్లాలోని వరం గల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని లక్షలాది ఓటర్ల వివరాలను పరిశీలించగా వేలాది మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించా రు. బీఎల్‌వోల ద్వారా నోటీసులు అందుకుంటున్న వారు ఈ నెల27 నుంచి నిర్ణీత గడువు లోగా తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మ్యాపింగ్ కాని, ఆధారాలు సరిగ్గాలేని ఓటర్లకు ఇళ్ల వద్దకే వచ్చి బీఎల్‌వోలు నోటీసులు అందజేస్తున్నారు. 01-07-1987లోపు జన్మించిన వారు నోటీసులు అందుకుంటే 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపిస్తే సరిపోతుం ది. 1987 నుంచి 2004 మధ్యలో జన్మించిన వారు తప్పకుండా నోటీసు అందు కున్న వ్యక్తితో పాటు తల్లి లేదా తండ్రికి చెంది న గుర్తింపు కార్డు అందించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సవరణలు, ఆధారాల స్వీకరణ ప్రక్రియ 19 సెప్టెంబరు 2026తో ముగుస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత 19 అక్టోబరు 2026న తుది ఓటరు జాబితా విడుదల కానుంది. 12 రకాల గుర్తింపు కార్డులు ఇవే..నోటీసులు పొందిన ఓటర్లు 12రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని బీఎల్‌వోకి లేదా తహసీల్దార్ కార్యాలయంలో చూపించి తమ ఓటును సరిచేసుకోవాల్సి ఉం టుంది. 1. ఆధార్ కార్డు, 2. భారత పాస్‌పోర్ట్, 3. పాన్ కార్డ్, 4. డ్రైవింగ్ లైసెన్స్, 5. ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, 6. బ్యాంకు లేదా పోస్టాఫీస్ పాస్‌బుక్, 7. మహాత్మా గాంధీ ఉపాధి హామీ జాబ్ కార్డ్, 8. కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్, 9. పింఛను బుక్, 10. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గుర్తింపు కార్డ్, 11. రైతు పాస్‌బుక్ లేదా పట్టాదార్ పాస్‌బుక్, 12. ఎన్పీఆర్ స్మార్ట్ కార్డ్ లను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. 132,070 మందికి నోటీసులుజిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల ని యోజకవర్గాల్లో మొత్తం 483 పోలింగ్ బూత్ లు ఉండగా, 407,317 మంది ఓటర్లు ఉన్నట్లు ఈనెల 17తేదీన అధికారులు ఓటర్ల ముసా యిదాను విడుదల చేశారు. ఈ జాబితాలో 132,070 మందికి అధికారులు నోటీసులు అందించనున్నారు. మంగళవారం నాటికి 1821 మందికి బీఎల్‌వోలు నోటీసులు అంద జేశారు. నోటీసులు అందుకున్నవారికి నిర్ణీత సమ యం కేటాయిస్తారు. ఆ గడువులోపు ఆధా రాలు చూపకుంటే ఓటుహక్కును కోల్పోతారు. ఆ తర్వాత ఆధారాలు తీసుకువచ్చిన అక్టోబరు



15 తర్వాత కొత్త దరఖాస్తులకు ఫారం-6, సవరణలు, పోలింగ్ కేంద్రం మార్పుకు ఫారం-8, అభ్యంతరాల కోసం ఫారం-7 ద్వారా సమర్పి ంచాల్సి ఉంటుంది. సెప్టెంబరు 19 తేదీలోపు ఆధారాలు అందించాలి..ఎన్.రవి, (అదనపు కలెక్టర్, హనుమకొండ)ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తిచేయాలని ఇటీవల సమీక్షలో కలెక్టర్ ఆదేశించారు. నోటీసులు పొందిన ఓటర్లు నిర్లక్ష్యం చేయ కుండా వెంటనే తగిన ఆధారాలతో స్పందిం చాలి. లేకుంటే అక్టోబరు 19న ప్రచురించే తుది ఓటరు జాబితా నుంచి ఓటు హక్కు తొలగించబడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అనామలిస్ అంటే ఏమిటీ? ఎన్యూమరేషన్ ప్రక్రియలో సరిగా వివరాలు నమోదు కాకపోవడం ద్వారా అనామలిస్ సమస్య తలెత్తింది. ఇంటి పేరు, తండ్రి లేక భర్త పేర్లు తప్పుగా ఉండటం, లేదా వయస్సు నమోదులో వ్యత్యాసాలు ఉండటం చేత, పాతికేళ్ల కిందట వేసిన ఓటుకి, ప్రస్తుత ఓటుకి సంబంధించి సరైన లింక్ లేదా ఆధారాలు చూపకపోవడం, 2002లో ఎక్కడ ఓటు ఉందో చెప్పకపోవడం, తల్లిదండ్రుల వివరాలు ఇవ్వకుండా ఎన్యూమరేషన్ ఫారాన్ని అసంపూ ర్తిగా నింపి బీఎల్‌వోలకు అప్పగించిన వారిని ఈ అనామలిస్ విభాగంలో చేర్చారు.

# వేగంగా ఎస్ఎల్బీసీ పనులు – రంగంలోకి అత్యాధునిక త్రీఆర్మ్ బూమర్ యంత్రం



**శ్రీశైలం:** ప్రమాదం తర్వాత ఆగిపోయిన ఎస్ఎల్బీసీ పనులు తిరిగి గాడిన పడ్డాయి. పూర్తి భద్రతా చర్యలతో పున:ప్రారంభమై, ఇప్పుడు కీలక దశకు చేరుకున్నాయి. ప్రమాదం జరిగిన షీర్ జోన్‌కు సమాంతరంగా చేపట్టిన బైపాస్ సొరంగం తవ్వకం పూర్తయింది. జపాన్ నుంచి తెప్పించిన అత్యాధునిక త్రీ ఆర్మ్ బూమర్ ద్వారా పనులు మరింత వేగవంతం అవుతాయని అంటున్నారు. 2028 మే లక్ష్యాన్ని చేరుకునేలా సొరంగం పనులను మరింత వేగవంతం చేసేం దుకు అధికారులు చర్యలు తీసుకుం టున్నారు. ప్రత్యేక బృందంతో పర్యవేక్షణ : శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్బీసీ) సొరంగం పనులు మళ్లీ వేగం పుంజుకుంటు న్నాయి. గతంలో జరిగిన ప్రమాదం అనంతరం కొంతకాలం నిలిచిపోయిన పనులను రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం తిరిగి ప్రారంభించి ంది. సొరంగం పనులను పూర్తి చేయడంలో వేగంతో పాటు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సొరంగం పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సైన్యంలో సొరంగ ాల నిర్మాణంలో పనిచేసిన నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులను పూర్తిగా అంచనా వేసిన తర్వాతే ముందుకు వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. బైపాస్ టన్నెల్ పనులు పూర్తి : నేషనల్ జియోఫి జికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో హెలీబో ర్న్ సర్వే నిర్వహించారు. సర్వే ద్వారా గుర్తించిన భౌగోళిక పరిస్థితులు, రాతి పొరలు, షీర్‌జోన్లకు అనుగుణంగా తవ్వకాలు చేపడుతున్నారు. చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, ఇంజినీర్లు తగిన జాగ్రత్తలు తీసుకొని పనులు సాఫీగా సాగేలా చూస్తున్నారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమాంతరంగా తవ్విన బైపాస్ టన్నెల్ పనులు పూర్తయ్యాయి. తాజాగా ప్రధాన సొరంగం పనులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని దాటి ముందుకు సాగుతున్నాయి. షీర్ జోన్ ప్రాంతంలో సుమారు 12 మీటర్ల మేర తవ్వకానికి దాదాపు 20 రోజుల సమయం పట్టింది. ఆ తర్వాత మరో 3.5 మీటర్ల మేర తవ్వకం పూర్తయింది. ప్రస్తుతం గట్టి రాతి ప్రాంతం ఎదురవుతుండటంతో పనులు కొంత సులభంగా సాగుతున్నాయని ఇంజినీర్లు చెబుతున్నారు. ప్రమాదం తర్వాత ఇప్పటి వరకు సుమారు 500 మీటర్ల మేర సొరంగం తవ్వకం పూర్తయింది. ఇంకా దాదాపు 9.2 కిలోమీటర్ల సొరంగం తవ్వాల్సి ఉంది. అత్యాధునిక జపాన్ యంత్రం సహాయంతో : సొరంగం పనుల వేగాన్ని మరింత పెంచేందుకు అత్యాధునిక త్రీఆర్మ్ బూమర్ యంత్రాన్ని రంగంలోకి దించారు. జపాన్ నుంచి సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ యంత్రాన్ని తీసుకొచ్చారు. ఇప్పటివరకు సొరంగం ఎగువ, దిగువ భాగాల్లో విడివిడిగా తవ్వకాలు చేపట్టాల్సి వచ్చేది. త్రీఆర్మ్ బూమర్ అందుబాటులోకి రావడంతో ఒకేసారి పూర్తి భాగాన్ని తవ్వే అవకాశం ఏర్పడింది. సుమారు 10 మీటర్ల వ్యాసంతో సొరంగం తవ్వే సామర్థ్యం ఈ యంత్రానికి ఉంది. సోమవారం రాత్రి నుంచే త్రీ ఆర్మ్ బూమర్‌తో తవ్వకం ప్రారంభించారు. ఇప్పటివరకు ఔట్ లెట్ వైపు నుంచి సాగిన పనులతో పాటు తాజాగా ఇన్ లెట్ వైపు నుంచి తవ్వకాలు ప్రారంభమ య్యాయి. ఇరువైపులా కలిపి రోజుకు సుమారు 17 మీటర్ల మేర సొరంగం తవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మరో బూమర్? కోసం కూడా ఆర్డర్ : పనుల వేగాన్ని కొనసాగించేందుకు మరో త్రీఆర్మ్ బూమర్‌ను సెప్టెంబర్ నెలాఖరు నాటికి అందుబాటులోకి రానుంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నా యంగా ఉపయోగించేందుకు మూడో బూవ ంర్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఎస్?ఎల్?బీసీ సొరంగం పనులను 2028 మే నాటికి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేస్తున్నారు. త్రీఆర్మ్ బూమర్ల వినియోగం పెరగడంతో ఇకపై తవ్వకాల వేగం మరింత పెరుగుతుందని

# పాలిటెక్నిక్ కాలేజీల విలీనం వెనుక రేవంత్ రెడ్డి భారీ కుట్ర..




రాష్ట్రంలో మరో భారీ కుంభకోణానికి సీఎం రేవంత్ రెడ్డి తెర తీశారు. కొద్ది రోజులుగా పాలిటెక్నిక్ కాలేజీల విలీనం వద్దని ఉద్యార్థులు రోడ్లపై కొచ్చి ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపో వడం అనేక అనుమానాలకు తావిచ్చింది. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనం వెనుక సీఎం రేవంత్ రెడ్డి భారీ కుట్రకు వ్యూహ రచన చేశారు. దీనిపై తెలుగు స్క్రైబ్ పరిశీలనలో దిమ్మదిరిగే విషయాలు బయటపడటం కలకలం రేపింది. రూ. 30,000 కోట్ల విలువైన 60 పాలిటెక్నిక్ కాలేజీల భూములను కాజేసేందుకే రేవంత్ ప్లాన్ చేసినట్లు తెలిసింది. గత 2 వారాలుగా పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్ల మీదకెక్కి జీవో 97ను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా మొండిపట్టుదలకు పోయిన రేవంత్.. జీవో 97పై కమిటీ వేసి డైవర్షన్ డ్రామా మొదలు పెట్టారు. పాలిటెక్నిక్ కాలేజీ 1923లో నిజాం హయాంలోనే మాసబ్‌ట్యాంక్ వద్ద ప్రారంభమైంది. 103 ఏళ్లుగా పేద విద్యార్థులకు తక్కువ ఫీజులో అత్యున్నత విద్యను అందిస్తున్నది. మరోవైపు వందల కోట్లతో ప్రారంభించిన రేవంత్ బ్రెయిన్‌చైల్డ్ స్కిల్ వర్సిటీ అట్టర్ ఫ్లాప్ గా మారింది. ఈ నేపథ్యంలో ఒకే దెబ్బకు రెండు పిట్టలు అని భావించిన సీఎం జీవో 97 పేరుతో విలీనం ప్లాన్ చేశాడు. వేల కోట్ల రూపాయల కాలేజీ భూములను కాజేస్తూ.. తన స్కిల్ వర్సిటీని విద్యార్థులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కరీంనగర్ లాంటి నగరాల్లో మెయిన్ రోడ్ కాలేజీ భూములపై రేవంత్ కన్నుపడింది. మొన్న హెచ్‌సీయూ 400 ఎకరాలు.. నిన్న ఉర్దూ వర్సిటీ 50 ఎకరాలు.. నేడు పాలిటెక్నిక్ భూములు ఇలా విలువైన భూములను కొల్లగొట్టేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిసింది.

# పార్టీకి కార్యకర్తలే పునాదిరాళ్లు?



**చంద్రుగొండ, ఆగస్టు 26 :** బీఆర్ఎస్ పార్టీకి గ్రామాల్లో కార్యకర్తలే పునాదిరాళ్లు వంటి వారిని అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరు, రావికంపాడు గ్రామాల్లో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పార్టీ దిమ్మలను ప్రారంభించి పార్టీ జెండాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మెచ్చ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అలివిగానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. రైతులకు కనీసం ఎరువులు ఇవ్వలేని ప్రభుత్వం భేషరతుగా రైతాంగానికి క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం అయ్యన్నపాలెం గ్రామంలో అకస్మాత్తుగా మృతి చెందిన ఆటో డ్రైవర్ నాగులు మీరా కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, శ్రేణులు, గ్రామ, మండల కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

# సెక్షన్ 22ఏ జాబితా రద్దు చేయకుంటే.. ఢిల్లీ తరహా జెన్‌జీ ఉద్యమం తప్పదు..



**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వమే ఒక పెద్ద కబ్జాదారు అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమ ర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడికి అడ్డికి పావుశేరు లెక్కన భూములు కట్టాబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేపీహెచ్‌బీలో ఒక్క గజమైనా అమ్మినామా అని ప్రశ్నించారు. కానీ అదే కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లలో లక్ష ఎకరాల అసైన్డ్ భూములను అమ్మిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్‌ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహిం చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడు తూ. ప్రభుత్వ భూములు అమ్ముతున్నారు.. అసై న్డ్ భూములను లాక్కుం టున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. పారిశ్రా మికవేత్తలకు కమీషన్లకు భూములు అమ్ము కుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి తమ్ము డికి అడ్డికి పావుశేరు లెక్కన భూములు కట్టబ ెట్టారని విమర్శించారు. ప్రజల భూములేమో నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి వెళ్తోందని ధ్వజమెత్తారు. లక్ష ఎకరాల అసైన్డ్ భూములు అమ్మింది ఈ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే ఒక పెద్ద కబ్జాదారు అని విమర్శించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రతిపక్షంపై కాదు.. ప్రజలపై సెక్షన్ 22ఏ బాంబు వేశాడని హరీశ్‌రావు అన్నారు. రియల్ ఎస్టేట్ తెలుసు కనుకనే ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని తెలిపారు. మీకు కబ్జాలు తెలుసు.. మాకు పోరాటాలు తెలుసని పేర్కొన్నారు. హెచ్‌సీయూ భూములను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదవపెట్టిండు అని తెలిపారు. బ్రోకర్లకు రూ.700 కోట్లు లంచం ఇచ్చి రూ.15వేల కోట్ల అప్పు తెచ్చిండని పేర్కొన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో 200, ఉర్దూ యూనివర్సిటీలో 50 ఎకరాలు లాక్కున్నాడని అన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ భూములను కూడా అమ్మాలని చూస్తున్నారని మండిపడ్డారు. హిల్ట్ పాలసీ పేరుతో పారిశ్రామిక భూములను అమ్మే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ హయాంలో యూఎల్‌సీ యాక్ట్‌ను రద్దు చేశారని గుర్తుచేశారు. 2008కు ముందు యూఎల్‌సీలో ఉన్నాయని.. ఇప్పుడు భూములన్నీ సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని తెలిపారు. ఒకప్పుడు కూకట్‌పల్లిలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉండేదని హరీశ్‌రావు గుర్తుచేశారు.

# ప్రతి నేతన్నకూ 'నేతన్నల సేవలో పథకం'.. ఆందోళన వద్దు



**శ్రీసత్యసాయి జిల్లా, ఆగస్టు 26:** మగ్గం నేసే ప్రతి నేతన్నకూ నేతన్నల సేవలో పథకం అందజేస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. మొదటి విడతలో 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. రెండో విడతగా త్వరలోనే అర్హులకు ఆర్థికసాయం అందిస్తామన్నారు. కొత్తగా 36,617 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను గుర్తిస్తామని..ఆ వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నేతన్నల సేవలో నిధులను జమ చేయనున్నట్లు తెలిపారు. అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. చేనేతల వెంటే కూటమి ప్రభుత్వం ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్నల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. 365 రోజులూ నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని చెప్పారు. నేతన్నల సేవలో పథకంపై గొడ్డలి పార్టీ అపోహలు సృష్టిస్తోందని మండిపడ్డారు. వైసీపీ ట్రాప్‌లో నేతన్నలు పడొద్దని మంత్రి సవిత కోరారు.

# సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని చూస్తే ఊరుకోం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అన్యమత ప్రదేశ్‌గా మార్చారంటూ జగన్‌పై దుయ్యబట్టారు. హిందూ దేవాలయలు, దేవతలపై దాడులు చేసి విగ్రహాల చేతులు నరికివేశారని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని ఎవరైనా నాశనం చేయాలని చూస్తే రాబోయే రోజుల్లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు బీజేపీ కంకణబద్ధమై ఉందన్నారు. విజయసాయిరెడ్డి ఆరోజు వైసీపీ ప్రభుత్వంలో ఉన్నప్పుడే సనాతన ధర్మంపై మాట్లాడి ఉంటే బాగుండేదని భానుప్రకాశ్ అభిప్రాయపడ్డారు. అన్యాయం జరిగినప్పుడే మాట్లాడాలని.. అప్పుడే ఆ నిజాయితీకి గుర్తింపు ఉంటుందన్నారు. బయటికి వచ్చిన తర్వాత మాట్లాడితే దానికి



విలువ తగ్గుతుందని చెప్పుకొచ్చారు. కాకినాడలో సౌజన్య 'లవ్ జిహాద్' ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని తెలిపారు. హిందూ సమాజానికి తామున్నామని భరోసా ఇస్తున్నామని అన్నారు. దేశంలో కొన్ని వేల మంది యువతులు, మహిళలు 'లవ్ జిహాద్'కు బలైపోతున్నారని వ్యాఖ్యానించారు. సాదిక్ లాంటి దర్మార్గుల వెనుక కర్త, కర్మ, క్రియ ఎవరో గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సాదిక్ కుట్రపై లోతుగా విచారణ జరిపి, శిక్షించాలని ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఉన్న సాదిక్ లాంటి వెధవవలు, దుర్మార్గులు, నీచులను గుర్తించాలని భాను ప్రకాశ్ కోరారు. బాధితులు ఏక్షణంలోనైనా సహాయం కోసం సంప్రదించేలా ప్రభుత్వమే 'టోల్ ఫ్రీ' నెంబర్ ఏర్పాటుమంది యువతులు, మహిళలు 'లవ్ జిహాద్'కు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేవరకు వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసుల రక్షణ కూడా బాధితులకు ఏర్పాటు చేస్తామన్నారు. దీనిపై ఏపీ డీజీపీ ప్రత్యేకంగా దృష్టి సారించాలని భాను ప్రకాశ్ రెడ్డి కోరారు.

# ఒంగోలు మైనింగ్ లంచం కేసు.. మాజీ మంత్రి శిద్ధా కుటుంబ సభ్యులపై కేసు

**ప్రకాశం జిల్లా, ఆగస్టు26 :**
ప్రకాశం జిల్లా ఒంగోలులో మైనింగ్ శాఖ డీడీఎంఎస్ శివశంకర్ లంచం కేసులో సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెల 17వ తేదీన ఒంగోలులోని కేబీ రెసిడెన్సీలో మైనింగ్ సేఫ్టీ విభాగం డీడీఎంఎస్ శివశంకర్‌కు.. మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు కుటుంబ సభ్యులు రూ.2 లక్షల లంచం ఇచ్చినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.ఈ వ్యవహారంపై నిఘా పెట్టిన సీబీఐ అధికారులు డీడీఎంఎస్ శివశంకర్‌ను పట్టుకున్నారు. ఈ కేసులో మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌ను ఏ1గా సీబీఐ చేర్చింది. మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు కుమారుడు సుధీర్ కుమార్‌ను ఏ2గా, శిద్ధా రాఘవరావు అన్న కుమారుడు శిద్ధా వెంకట సురేశ్ కుమార్‌ను ఏ3గా పేర్కొంది. ప్రైవేటు సర్వేయర్ ఏ. శు భాష్కర్ రెడ్డిని ఏ4గా, వాసవి గ్రానైట్స్ మేనేజర్ వై. సురేంద్రను ఏ5గా చేర్చింది. అలాగే



మరికొందరు గుర్తుతెలియని ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తులను ఏ6గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.సీబీఐ ఎఫ్ఐఆర్ ప్రకారం.. జూన్ 25వతేదీన మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు కుటుంబానికి చెందిన వాసవి గ్రానైట్ క్వారీలో రాయి పడి ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ప్రమాద ఘటనపై క్వారీ యాజమాన్యానికి అనుకూలంగా నివేదిక ఇప్పించేందుకు మైన్స్ డిప్యూటీ డైరెక్టర్‌కు లంచం ఇచ్చినట్లు సీబీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో రూ.2 లక్షల లంచం చెల్లించినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో వెల్లడించింది.ఈ కేసులో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 7ఏ, 8తో పాటు బీఎన్ఎస్ సెక్షన్ 61(2) కింద సీబీఐ కేసు నమోదు చేసింది. డీడీఎంఎస్ శివశంకర్‌తో పాటు శిద్ధా వెంకట సురేశ్, మరో ఇద్దరు ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. మరోవైపు శిద్ధా రాఘవరావు కుమారుడు శిద్ధా వెంకట సుధీర్ పరారీలో ఉన్నాడు.మనింగ్ క్వారీలో జరిగిన కార్మికుడి మృతి ఘటనకు సంబంధించిన నివేదికను ప్రభావితం చేసేందుకు లంచం ఇచ్చారనే ఆరోపణలు ప్రస్తుతం కేసులో కీలకంగా మారాయి. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది, లంచం వ్యవహారంలో మరింత మంది ప్రమేయం ఉందా అనే కోణాల్లో సీబీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉంది.

# జగన్ హయాంలోని ఐదేళ్లు బీసీలను ఊచకోత కోశారు: ఎంపీ విజయ్



**అమరావతి, ఆగస్టు26 :**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ) తెలుగుదేశం పార్టీ ఎంపీ చింతకాయల విజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను జగన్ మోసం చేశారని ధ్వజమెత్తారు. ఈ మేరకు విజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో బీసీల గురించి ఏ పార్టీ ఆలోచించలేదని తెలిపారు. బీసీల గురించి ఆలోచించిన ఏకైక పార్టీ టీడీపీ అని వ్యాఖ్యానించారు.వెనుకబడిన కులాలను వాడుకోవడం జగన్‌కు అలవాటని ఎంపీ విజయ్ విమర్శించారు. జగన్ హయాంలో బీసీల రిజర్వేషన్లను తగ్గించారని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లు బీసీలను జగన్ ఊచకోత కోశారని ఆగ్రహించారు. అమర్నాథ్‌గౌడ్‌ను కాల్చేసిన రోజు జగన్ ఎందుకు స్పందించలేదు? అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో సుబ్బయ్యను చంపేస్తే.. ఎందుకు మాట్లాడలేదు? అని నిలదీశారు. ఉత్తరాంధ్రను జగన్ మోసం చేశారని ఎంపీ చింతకాయల విజయ్ ధ్వజమెత్తారు.

# వైఎస్ వివేకా భూమి కబ్జా వ్యవహారం.. పులివెందుల సీఐపై బదిలీ వేటు



**కడప జిల్లా :**పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్‌పై బదిలీ వేటు పడింది. ఆయనను కడప వీఆర్ కు పంపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన భూమి కబ్జా వ్యవహారంలో నిర్లక్ష్యం వహించినందుకే డీఐజీ కోయ ప్రవీణ్ ఈ చర్యలు తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే... పులివెందులలో తమ కుటుంబానికి చెందిన భూమి ఆక్రమణకు గురైందని వివేకా కుమార్తె సునీత జిల్లా కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఒక కబ్జా ముఠా సదరు భూమిని ఆక్రమించడమే కాకుండా, నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలను సృష్టించినట్లు స్పష్టంగా నిర్ధారణ అయింది. దీంతో, అక్రమాలకు పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ చిన్నయ్య స్వయంగా పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినప్పటికీ, సంబంధిత నిందితులను అరెస్ట్ చేయడంలో సీఐ శ్రీరామ్ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలు వచ్చాయి. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించినందుకు గానూ డీఐజీ కోయ ప్రవీణ్ సీఐ శ్రీరామ్‌ను తక్ష ణమే వీఆర్‌కు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ఆ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

**విజయవాడ, ఆగస్టు26 :** శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం( పాత శివాలయం) నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకార కార్యక్రమం ( బుధవారం) జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా, జనసేన పార్టీ నాయకులు అమ్మిశెట్టి వాసు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.పాత శివాలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది..ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. విజయవాడలోని పాత శివాలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని తెలిపారు. ఈ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని వ్యాఖ్యానించారు. ఈ ఆలయం వచ్చిన తర్వాతనే విజయవాడ అభివృద్ధి చెందడం ప్రారంభమైందని ప్రస్తావించారు. ఈ ప్రసిద్ధిగాంచిన ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఆటోనగర్ ఐలా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉంది: ఎంపీ కేశినేని శివనాథ్అనంతరం విజయవాడ ఆటోనగర్ ఐలా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బుద్ధా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. ఆటోనగర్ ఐలా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. సుమారు లక్ష మంది కార్మికులు నివసించే ఈ ప్రాంతంలో ఐలా చాలా ప్రముఖ పాత్ర పోషిస్తూ ఉంటుందని



చెప్పారు. గత ఐలా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ఎన్నో కార్యక్రమాలు జరిగాయని వెల్లడించారు. గత రెండు సంవత్సరాల నుంచి ఐలా ఎలక్షన్స్ పెట్టాలని చెప్పి, అధికారంలోకి వచ్చాక ప్రతి నిత్యం పోరాడటం జరిగిందని చెప్పారు. కలెక్షన్స్ 60 శాతం దాటితేనే ఐలా ఎలక్షన్లు ఉంటాయని అధికారులు చెప్పడంతో, ఇప్పుడు అందరూ కూడా కలిసికట్టుగా ఉండి, కలెక్షన్స్ 60శాతం దాటించి ఎలక్షన్ కండక్ట్ చేసుకున్నారని తెలిపారు.ఆ సమస్యలను ఐలానే పరిష్కరించాలి..శాంతియుతంగా, ప్రశాంతంగా జరిగిన ఈ ఎలక్షన్లలో విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు ఎంపీ శివనాథ్ చెప్పారు. ప్రెసిడెంట్: శివనాగేశ్వరరావు, వైస్ చైర్మన్: దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ: కలామ్, కార్యవర్గ సభ్యులు ఈ ఎలక్షన్లలో గెలిచిన వారందరికి కొన్ని సూచనలు చేస్తున్నానని అన్నారు. విజయవాడకే జీవనాడి ఆటోనగర్ అని తెలిపారు. ఈ జీవనాడి అయిన ఆటోనగర్‌లో రోడ్లు గానీ, డ్రైనేజీలు గానీ, మంచినీటి సమస్య గానీ ఏది ఉన్నా సరే.. ఐలానే పరిష్కరిం చాలని అన్నారు. ప్రజాప్రతినిధులందరం కూడా ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తామని చెప్పారు. పోరాడి 3 రోడ్ల టెండర్లు పూర్తి చేశామని, ఇప్పటికే పనులు జరుగుతున్నాయని ఎంపీ శివనాథ్ వెల్లడించారు. 4వ రోడ్డు గద్దె రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో ప్రారంభించారని చెప్పారు. శక్తి కళ్యాణ మంటపం రోడ్డు కూడా రెడీ అయ్యిందని తెలిపారు. 24 గంటలు వాహనాలు ఆటోనగర్‌కి వచ్చి, విజయవాడకి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఉండే విధంగా తామందరం కృషి చేస్తామని చెప్పారు. రాబోయే కాలంలో ఐలా మరింత విస్తృతంగా అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. లక్ష మంది కార్మికులకు దిశా నిర్దేశం చేసే విధంగా ఉండాలని ఎంపీ శివనాథ్ కోరారు.

# ఉద్యోగానికి రాజీనామా చేసి.. బెజవాడ బయలుదేరిన భావన.. అంతలో..

**కోదాడ, ఆగస్టు 26:** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో 23 సంవత్సరాల భావనా వర్ష కూడా ఉన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్ఆర్ విభాగంలో పని చేసిన ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేసి సొంతూరు విజయవాడకు పయనమైంది. ఇందుకోసం మంగళవారం రాత్రి 11.00 గంటలకు విజయవాడ వెళ్లేందుకు హైదరాబాద్‌లో ట్రావెల్స్ బస్సు ఎక్కింది. ఉదయం 5.00 గంటలకు విజయవాడలో దిగిపోతామని భావన అనుకుంది. కానీ అంతలోనే ఆ బస్సు ప్రమాదానికి గురి కావడంతో మరణించింది. భావనా వర్ష మృతి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు



కన్నీరుమున్నీరు అవుతున్నారు. వారంతా కోదాడకు హుటాహుటిన బయలుదేరారు. ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి.సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున 4.00 గంటలకు రహదారి పక్కన ఆగి ఉన్న లారీని హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారంతా కోదాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వాటికి పోస్ట్‌మార్టం నిర్వహిస్తున్నారు.బస్సు ప్రమాదంపై స్పందించిన ప్రధాని..ఈ బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ తన ఎక్స్ వేదికగా స్పందించారు. 'తెలంగాణలోని సూర్యాపేట జిల్లాలో దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదం గురించి తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. తమ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ఇతరులకు నీతులు చెప్పే ముందు చరిత్ర చూసుకోవాలి జగన్

**అమరావతి, ఆగస్టు 26:**
వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. అలాంటి జగన్.. వెన్ను పోటుపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఇతరులకు నీతులు చెప్పే ముందు రాజకీయ చరిత్ర చూసుకోవాలంటూ జగన్‌కు చురకలంటించారు.




జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ వ్యవహారంలో వైఎస్ జగన్ వైఖరిపై మండిపడ్డారు.బీసీ రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ వైసీపీ అధినేతపై మంత్రి సత్యకుమార్ నిప్పులు చెరిగారు. రిజర్వేషన్లు ప్రకటించడం కాదు.. చట్టబద్ధంగా నిలబెట్టడమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. జగన్ హయాంలో బీసీ రిజర్వేషన్లు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు చట్టబద్ధమైన సామాజిక న్యాయం చేస్తోందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.బీసీలను ఓటు బ్యాంకుగా చూసింది జగన్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. బీసీలను పాలనలో భాగస్వాములుగా చేస్తుంది కూటమి ప్రభుత్వమని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమిపై జగన్‌లో ఇప్పుడే ఆందోళన మొదలైందంటూ ఎద్దేవా చేశారు. ఓటమికి కారణాలు వెతికే పనిలో జగన్ ఉన్నారని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
గురువారం,
ఆగస్టు 27, 2026



# జైస్వాల్‌నే కాదు వైభవ్‌ని కూడా శిక్షించాల్సిందే..



## టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్

కొలంబోలో జరుగుతున్న 2వ టెస్ట్ తొలి రోజు టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్, అసిత ఫెర్నాండో మధ్య జరిగిన వాగ్వాదం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ 17వ ఓవర్లో ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత జైస్వాల్ అతడి వైపు వెళ్లగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది.
ఈ క్రమంలో ఫెర్నాండో తన తలను జైస్వాల్ వైపు కదిలించాడు. జైస్వాల్ కూడా ముందుకు వంగడంతో ఇద్దరి తలలు తాకాయి. ఘటనపై ఐసీసీ చర్యలు తీసుకుని ఇద్దరికీ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఒక్కొక్కరికి ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించింది. మంజ్రేకర్ మాత్రం ఈ శిక్ష సరిపోదని అభిప్రాయపడ్డారు. మైదానంలో శారీరకంగా తాకడం వంటి ఘటనలకు కఠినమైన చర్యలు అవసరమని ఆయన సూచించారు. ఈ సందర్భంగా యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన గత ఘటనను మంజ్రేకర్ ప్రస్తావించారు. ఈ ఏడాది జరిగిన ఏ జట్ల ట్రై-సిరీస్‌లో భారత్ ఏ తరపున ఆడిన వైభవ్.. శ్రీలంక ఏ ఆటగాళ్లతో ఘర్షణకు దిగిన ఘటనను ఆయన గుర్తుచేశారు. ఐసీసీ, బీసీసీఐ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంజ్రేకర్ కోరారు. యువ ఆటగాళ్లకు ఇటువంటి ప్రవర్తనను ఉపేక్షించడం సరైన సందేశం కాదని ఆయన పేర్కొన్నారు. ఎక్స్‌లో మంజ్రేకర్ స్పందిస్తూ ఐసీసీ, బీసీసీఐని ఉద్దేశించి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "వైభవ్ ఫర్ ఇండియా ఏ ఇటీవల.. ఇప్పుడు జైస్వాల్.. ఇలాంటి ప్రవర్తన నుంచి తప్పించుకునేలా చేస్తే, అదే ప్రవర్తనను మళ్లీ చేయడానికి వారికి అలవాటు పడేలా చేసినట్టే" అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు క్రీడకు మంచిది కాదని, ఆటగాళ్ల భవిష్యత్తుపైనా ప్రభావం చూపొచ్చని మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. శారీరక ఘర్షణలు జరిగినప్పుడు కఠినమైన శిక్షలు ఉండాలని ఆయన సూచించాడు. రెండో రోజు ఆట ప్రారంభానికి ముందు జైస్వాల్ తన చర్యను సమర్థించుకున్నాడు. "అతను ఏం అన్నాడో మీకు తెలియకపోతే తీర్పు ఇవ్వొద్దు. ఎవరైనా హద్దు దాటితే వారికి తెలియజేయాలి. ఇది భారత్.. మేం పోరాడతాం, సమాధానం ఇస్తాం" అని చెప్పుకొచ్చాడు. జైస్వాల్, ఫెర్నాండోలకు జరిమానాతో పాటు డీమెరిట్ పాయింట్లు పడినా, మంజ్రేకర్ మాత్రం మరింత కఠిన చర్యల అవసరాన్ని ముందుకు తెచ్చారు. వైభవ్ సూర్యవంశీ ఘటనను కలిపి చూస్తే, యువ ఆటగాళ్ల ప్రవర్తనపై క్రికెట్ బోర్డులు ఎలాంటి సందేశం ఇవ్వాలన్న ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది.

# గెలుపు ముంగిట భారత్!



- తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 290
- ఫాలో ఆన్ ఆడుతున్న శ్రీలంక
- 16 పరుగుల ఆధిక్యంలో శ్రీలంక
- సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కరుణిస్తే విజయం భారత్ సొంతమవ్వనుంది. అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్‌లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్య బండార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ..భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా.. శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ఆసియా గేమ్స్ క్రికెట్ షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 18న టీమ్‌ఇండియా మహిళలు మొదటి మ్యాచ్




2026 ఆసియా గేమ్స్ నుంచి అదిరే అప్డేట్ వచ్చింది. జపాన్ వేదికగా జరగనున్న ఈ గేమ్స్?లో క్రికెట్ పోటీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ముందుగా మహిళల జట్ల మధ్య పోటీలను నిర్వహించనున్నారు. ఆ తర్వాత పురుషుల కాంపిటీషన్ ఉండనుంది. ఈ మ్యాచ్‌లన్నింటినీ జపాన్‌లోని కొరోగి అథ్లెటిక్ పార్క్‌లో నిర్వహించనున్నారు. మహిళల క్రికెట్ పోటీల్లో భారత్, శ్రీలంక, జపాన్, మలేసియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, థాయ్‌లాండ్ జట్లు పోటీ పడనున్నాయి. ఈ మ్యాచ్‌లు సెప్టెంబర్ 17న షురూ కానుండగా, టీమ్‌ఇండియా మహిళలు తమ మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 18న ఆడనుంది. ఈ మ్యాచ్ జపాన్‌తో జరగనుంది.ఆ తర్వాత 20, 22 తేదీల్లోనే సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 22న జరుగుతుంది, అలాగే కాంస్య పతక పోరు కూడా అదే రోజు ఉంటుంది. ఈ పోటీల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. గత సీజన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన టీమ్‌ఇండియా మరోసారి అదే ప్రదర్శనను రిపీట్ చేయాలని ఆశిస్తోంది. పురుషుల క్రికెట్ పోటీల్లో భారత్‌తోపాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు టోర్నమెంట్‌లో నేరుగా అర్హత సాధించాయి. ఈ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడుతాయి. మరోవైపు, ఆఫ్గానిస్థాన్, జపాన్, నేపాల్ టీమ్స్‌ను 'గ్రూప్ -సీ'లో ఉంచారు. హాంకాంగ్, చైనా, మలేసియా, ఒమన్ జట్లను 'గ్రూప్ డీ'లో చేర్చారు. ఈ గ్రూపులలో విజేతలుగా నిలిచిన జట్లు, క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న జట్లతో తలపడతాయి. గ్రూప్ స్టేజ్‌లో ఓడిపోయిన జట్లు పోటీ నుంచి నిష్క్రమిస్తాయి. ఇక పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న ప్రారంభమవుతాయి. ముందుగా గ్రూప్ ఏ, గ్రూప్ బీలోని జట్లు పోటీపడతాయి. ఆ తర్వాత భారత 28న తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే అది క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కాబట్టి ప్రత్యర్థి ఎవరో ఇంకా తేలలేదు. అయితే శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా ఈ పోటీలో ఆడనుంది. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

# సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చెమటోడ్చుస్తున్న ప్లేయర్లు




టీమిండియా అభిమానులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళ్లు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్, శ్రీలంక జట్ల మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతుండగా.. మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ-ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. బెంగళూరులోని వర్కౌట్స్, ట్రైనింగ్ సెషన్లకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా.. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన గాయం నుంచి వేగంగా కోలుకుంటూ పునరావాస శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్వైపాక్షిక సిరీస్‌లపైనే ఉంది. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న 3 మ్యాచ్ ల టీ20 అంతర్జాతీయ సిరీస్ సమయానికి ఈ వైట్-బాల్ స్టార్లు పూర్తి ఫిట్నెస్ సాధించాలని చూస్తున్నారు. ఆ తర్వాత అక్టోబర్ లో వెస్టిండీస్ జట్టుతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు ఈ కీలక ఆటగాళ్లందరూ భారత జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఆటగాళ్లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇవ్వడం, గాయాల నిర్వహణపై కొన్ని ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో మాట్లాడి క్లారిటీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియలో, ఆటగాళ్ల ఫిట్‌నెస్ నివేదికలలో పూర్తి పారదర్శకత ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆటగాడు మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే మరికరిని ఎంపిక చేస్తారని అర్థం. తాము నిందలు వేసేందుకు ఇష్టపడమని.. ప్లేయర్లు కోలుకునే పురోగతిని ప్రతి దశలో పర్యవేక్షిస్తూ సెలెక్షన్ కమిటీకి నివేదిస్తామని వీవీఎస్ లక్ష్మణ్ పేర్కొన్నారు. మొత్తానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో స్టార్ ప్లేయర్ల కఠోర శ్రమ చూస్తుంటే.. త్వరలోనే భారత వైట్-బాల్ జట్టు పూర్తి బలంతో మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.

# టాప్ లేపిన మిచెల్ స్టార్క్, రిషభ్ పంత్!

- ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ దుమ్మురేపాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను వెనక్కినెట్టి మిచెల్ స్టార్క్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మిచెల్ స్టార్క్ 872 పాయింట్లతో నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా(862), మ్యాట్ హెన్రీ(861) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్(807) ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో స్థానంలో నిలిచాడు. బంగ్లాదేశ్‌తో ఇటీవల ముగిసిన రెండు టెస్ట్‌ల సిరీస్‌లో మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగాడు. రెండో టెస్ట్‌లో 10 వికెట్లు పడగొట్టిన స్టార్క్.. రెండు స్థానాలు ఎగబాకి బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ అద్భుత ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఫస్ట్ బాల్‌కే మిచెల్ స్టార్క్ వికెట్ పడగొట్టాడు. బ్యాటింగ్ విభాగంలో టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ఈ ఇద్దరూ మెరుగైన ప్రదర్శన చేశారు. రెండో టెస్ట్‌లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ తృటిలో శతకాన్ని చేజార్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రదర్శనతో రిషభ్ పంత్(711) ఆరు స్థానాలు ఎగబాకి టాప్-10లోకి వచ్చి 8వ ర్యాంకు అందుకోగా.. కేఎల్ రాహుల్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకొని 30వ స్థానంలో నిలిచాడు. మరోవైపు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన శుభ్‌మన్ గిల్(711)8వ స్థానానికి పడిపోయాడు. రెండు టెస్ట్‌ల్లో విఫలమైన యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారాడు. ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్(874), జో రూట్(850), స్టీవ్ స్మిత్(840), ట్రావిస్ హెడ్(811), టెంబా బవుమా(775) టాప్-5 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా(428)తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. శ్రీలంకతో తొలి టెస్ట్‌లో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.



# 'టాక్సిక్' దూకుడు..

## మధ్యాహ్నానికే 'ధురంధర్'ను దాటేసిన యశ్ మూవీ

యశ్ నటించిన 'టాక్సిక్'కు ఆరంభంలో ఎదురైన విమర్శలు, ఆన్‌లైన్ ట్రోలింగ్ నేడు బాక్సాఫీసు ప్రభంజనానికి ఏమాత్రం అడ్డుకాలేదు. బుధవారం ఉదయం నుంచే సినిమా థియేటర్ల వద్ద సందడి కనిపించింది. మధ్యాహ్నానికి ముందే రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' తొలిరోజు భారత్‌లో నెట్ వసూళ్లను 'టాక్సిక్' దాటేసింది.
ఓనం సెలవును టార్గెట్ చేస్తూ 'టాక్సిక్' ప్రేక్షకుల ముందుకొచ్చింది. సినిమా హింస, రొమాంటిక్ సన్నివేశాలపై విడుదలకు ముందు చర్చ జరిగినా ప్రేక్షకుల స్పందన మాత్రం బలంగా కనిపించింది. ఉదయం షోలకే పలు ప్రాంతాల్లో థియేటర్లు కళకళలాడాయి.
'సాక్‌నిల్క్' లెక్కల ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.40 గంటలకు 'టాక్సిక్' ఇండియా నెట్ వసూళ్లు రూ.31.76 కోట్లకు చేరాయి. 9,003 షోల ద్వారా ఈ మొత్తం వచ్చింది. ఇండియా గ్రాస్ రూ.37.48 కోట్లుగా నమోదైంది.
కన్నడ 2డీ వెర్షన్ 77.69 శాతం ఆక్యుపెన్సీతో ముందుంది. తెలుగు వెర్షన్ 57.08 శాతం, తమిళం 45.25 శాతం, మలయాళం 40.13 శాతం, హిందీ 37.85 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేశాయి.
రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' తొలిరోజు ఇండియాలో రూ.28.60 కోట్ల నెట్, రూ.33.60 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. 'టాక్సిక్' ఉదయం షోలతోనే ఆ మార్కును అధిగమించింది.
యశ్ 'కేజీఎఫ్: చాప్టర్ 2' తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.100-120 కోట్ల వసూళ్లు సాధించొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఆ స్థాయికి చేరితే అతిపెద్ద ఇండియన్ ఓపెనర్లలో ఒకటిగా నిలుస్తుంది. రూ.100 కోట్ల మార్కును దాటితే 'కేజీఎఫ్: చాప్టర్ 2' తర్వాత ఆ ఘనత సాధించిన రెండో కన్నడ చిత్రంగా నిలుస్తుంది.






# గర్భంతోనూ జిమ్‌లో సమంత.

గర్భధారణ సమయంలో తన ఫిట్‌నెస్ రొటీన్ ఎలా మారిందో నటి సమంత వెల్లడించింది. జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా శిక్షణ తీసుకున్నానని.. ఇప్పుడు శరీరం చెప్పేది వినడం నేర్చుకుంటున్నానని తెలిపింది.
సమంత ఎన్నో ఏళ్లుగా శక్తిని పెంచే వ్యాయామాలు చేస్తున్నట్లు చెప్పింది. గర్భధారణ సమయంలోనూ వ్యాయామం కొనసాగించేందుకు వైద్యుడి అనుమతి తీసుకున్నానని తెలిపింది. తన ట్రైనర్‌కు గర్భధారణ సమయంలో వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ ఉందని వెల్లడించింది. తన శరీరం, గత అనుభవం, గర్భధారణ పరిస్థితికి తగ్గట్టుగా వర్కౌట్స్‌లో మార్పులు చేసినట్లు వివరించింది.
ప్రతి ఒక్కరి గర్భధారణ ఒకేలా ఉండదని సమంత చెప్పింది. తన వర్కౌట్స్‌ను ఇతరులు అనుసరించొద్దని సూచించింది. వ్యాయామం చేసే ముందు వైద్యుడిని సంప్రదించాలని.. నిపుణులైన ట్రైనర్ సాయం తీసుకోవాలని కోరింది..తాను పంచుకున్న వీడియోలో ఛాతీకి సంబంధించిన వ్యాయామం చేసింది. అయితే గతంలోలా ఎక్కువ బరువు ఎత్తడంపై కాకుండా.. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడంపైనే ఇప్పుడు దృష్టి పెట్టినట్లు చెప్పింది. కొన్ని రోజులు వ్యాయామాన్ని తగ్గిస్తున్నానని తెలిపింది.
కొన్ని రోజులైతే వర్కౌట్ మొత్తం నేలపై పడుకోవడంతోనే పూర్తవుతోందని సమంత సరదాగా వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా తన శరీరాన్ని మరింత పని చేయడానికి సిద్ధం చేశానని.. ఇప్పుడు తక్కువ పని చేయమని శరీరం అడిగినప్పుడు దాన్ని గౌరవించడం నేర్చుకుంటున్నానని పేర్కొంది.
చిన్న ప్రాణాన్ని మోస్తున్న సమయంలో లక్ష్యాలు కూడా మారిపోతాయని సమంత అభిప్రాయపడింది. తన శరీరం ఇప్పటివరకు చేసిన పనుల్లో ఇదే అత్యంత బలమైన పని కావచ్చని పేర్కొంది. సమంత 2026 జూన్‌లో తన గర్భధారణ విషయాన్ని బహిరంగంగా వెల్లడించింది. భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించింది.



# యంగ్ హీరోల కొత్త ట్రెండ్‌లోకి కార్తికేయ!

టాలీవుడ్‌లో హీరోలు కేవలం యాక్టింగ్‌కే రిమితం కాకుండా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంటి విభాగాల్లోనూ తమదైన ముద్ర వేయాలని చూస్తున్న ట్రెండ్ క్రమంగా బలపడుతోంది. ఒకప్పుడు హీరోగా కెరీర్‌లో సెటిలైన తర్వాతే డైరెక్షన్ వైపు అడుగులు పడేవి. కానీ ఇప్పుడు యంగ్ హీరోలు తమకు నచ్చిన కథలను తామే చెప్పాలనే ఆలోచనతో కెమెరా వెనక్కి వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ మారుతున్న ట్రెండ్‌లో ఇప్పుడు కార్తికేయ కూడా చేరబోతున్నారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కార్తికేయ, ఇకపై కేవలం హీరోగా మాత్రమే కాకుండా సినిమా మేకింగ్‌లోని ఇతర విభాగాలపైనా దృష్టి పెట్టబోతున్నారనే డిస్కషన్ మొదలైంది. ముఖ్యంగా కథను సెలెక్ట్ చేసుకోవడం నుంచి దాన్ని తెరపైకి తీసుకురావడం వరకు మొత్తం క్రియేటివ్ రెస్పాన్సిబులిటీ తీసుకోవాలనే ఆలోచన యంగ్ హీరోల్లో పెరుగుతున్న నేపథ్యంలో కార్తికేయ డెసిషన్ కూడా అదే దిశలో కనిపిస్తోంది. ఇప్పటికే టాలీవుడ్‌లో నటుల నుంచి డైరెక్టర్లుగా మారిన ఉదాహరణలు చాలానే ఉన్నాయి. ఎన్టీఆర్, కృష్ణ, విజయ నిర్మల వంటి దిగ్గజాల నుంచి అవసరాల శ్రీనివాస్, విశ్వక్‌సేన్ వంటి సమకాలీన నటుల వరకు పలువురు యాక్టింగ్‌తో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. అయితే ప్రస్తుత తరం హీరోలలో ఈ ఆలోచనకు మరో కొత్త కోణం కనిపిస్తోంది. తమ మార్కెట్‌కు తగ్గ కథ కోసం ఎదురు చూడటం కంటే, తమకు నమ్మకం ఉన్న కథను తామే డెవలప్ చేసి ఆడియన్స్ ముందుకు తీసుకురావాలనే ప్రయత్నం పెరుగుతోంది. దీనికి మరిన్ని ఎగ్జాంపుల్స్ కూడా కనిపిస్తున్నాయి. ఆర్రెడీ కిరణ్ అబ్బవరం డైరెక్టర్ గా మారి సినిమా చేస్తుండగా, ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కూడా ఇదే బాటలో వెళ్తూ, తన స్వీయ దర్శకత్వంలో నటిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాల నటనా ప్రయాణం తర్వాత రామ్ డైరెక్షన్ లోకి అడుగుపెడుతున్నారు. యాక్టర్ గా సంపాదించిన ఎక్స్‌పీరియెన్స్‌ను ఇప్పుడు డైరెక్టర్ గా ఉపయోగించుకోవాలనే ప్రయత్నం ఈ మారుతున్న ఆలోచనా విధానానికి అద్దం పడుతోంది.

# కృతి సనన్ డ్రెస్‌పై దుమారం..

## రాఖీ యాడ్ ను వెనక్కి తీసుకున్న జ్యువెల్లరీ బ్రాండ్



ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ 'జీవ' తన రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనను అన్ని మీడియా వేదికల నుంచి ఉపసంహరించుకుంది. బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఈ యాడ్‌లో ఆమె ధరించిన దుస్తులు, ప్రచార కాన్సెప్ట్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వివాదంపై 'జీవ' బుధవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది.
భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని సంస్థ పేర్కొంది. కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడంతో పాటు, పెంపుడు జంతువులతోనూ ఆ అనుబంధాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ప్రచారాన్ని రూపొందించినట్లు వివరించింది. అయితే, ఇది అనుకోకుండా కొందరి మనోభావాలను దెబ్బతీసిందని అంగీకరించింది. అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ సదరు ప్రకటనను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించింది.సుమారు 36 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోలో కృతి సనన్, బ్రాలెట్ తరహా బ్లౌజ్‌తో కూడిన ఇండో-వెస్ట్రన్ దుస్తుల్లో కనిపించారు. తన సోదరుడికి, ఒక పెంపుడు శునకానికి ఆమె రాఖీ కడుతున్నట్లు అందులో చూపించారు. ఆమె వస్త్రధారణతో పాటు, రక్షాబంధన్ సంప్రదాయంలో పెంపుడు జంతువును భాగం చేయడంపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.ఈ ప్రకటనపై నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఘాటుగా విమర్శలు గుప్పించారు. 'లోదుస్తులు ధరించి సోదరుడికి రాఖీ కడతారా?' అని ప్రశ్నిస్తూ, ఇది ఉద్దేశపూర్వకంగా అసభ్యంగా ఉందని వ్యాఖ్యానించారు. నెటిజన్ల నుంచి కూడా పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో, సదరు జ్యువెల్లరీ బ్రాండ్ ఈ ప్రకటనను వెనక్కి తీసుకుంది.

# గోల్డెన్ గ్లోబ్ అవార్డును పగలగొట్టి అబద్ధం చెప్పా: ఇయాన్ మెక్‌కెల్లెన్



దిగ్గజ నటుడు సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్ తన కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు సంబంధించి తాను చెప్పిన ఒక అబద్ధాన్ని తాజాగా వెల్లడించారు. ప్రమాదవశాత్తు ఆ పురస్కారం మెమొంటో విరిగిపోవడంతో, అది కనిపించడం లేదని నిర్వాహకులకు అబద్ధం చెప్పినట్లు ఆయన అంగీకరించారు. 1997లో "రస్పుటిన్: డార్క్ సర్వెంట్ ఆఫ్ డెస్టినీ" చిత్రంలో అద్భుత నటనకు గానూ మెక్‌కెల్లెన్ ఉత్తమ సహాయ నటుడిగా గోల్డెన్ గ్లోబ్ అవార్డును దక్కించుకున్నారు. త్వరలో ప్రసారం కానున్న 'టీ విత్ జూడీ డెంజ్ ఫీచరింగ్ సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్' అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. దీనికి సంబంధించిన ఒక వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది."ఆ గోల్డెన్ గ్లోబ్ ప్రతిమను ఎలా తయారు చేశారో తెలుసుకోవాలనే కుతూహలంతో దాని కింద ఉన్న ఒక స్క్రూను విప్పాను. వెంటనే ఆ పురస్కారం ముక్కలైపోయింది. దాన్ని నేను తిరిగి అమర్చలేకపోయాను. అదే సమయంలో నా పేరును ఆ ప్రతిమపై చెక్కడం కోసం దానిని తిరిగి పంపాలని నిర్వాహకులు కోరారు. దాంతో అది కనిపించడం లేదని వారికి అబద్ధం చెప్పాల్సి వచ్చింది" అని మెక్‌కెల్లన్ వివరించారు.మెక్‌కెల్లెన్ తన సుదీర్ఘ కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం ఇదే కావడం విశేషం. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మరో ప్రముఖ నటి డేమ్ జూడీ డెంజ్ కూడా తన ఆస్కార్ అవార్డుకు సంబంధించిన ఒక పొరపాటును పంచుకున్నారు. స్కై ఆర్ట్స్ ఛానల్‌లో ఈ కార్యక్రమం త్వరలో ప్రసారం కానుంది.



# నా అంత సాధించాక మాట్లాడండి..

## శత్రువులకు క్వీన్ మాస్ వార్నింగ్!

నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తనపై విమర్శలు గుప్పిస్తున్న పలువురు బాలీవుడ్ ప్రముఖులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం స్టిల్ ఫోటోగ్రాఫర్లతో మాట్లాడిన కంగన .. కెరీర్‌లో ఎలాంటి విజయం సాధించని వారు తనకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తోటి నటీనటులు, ప్రముఖులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆశుతోష్ రాణా, సోనూ సూద్, రాఖీ సావంత్, తాప్సీ పన్నులను పేరుపేరునా ప్రస్తావిస్తూ కంగనా అసహనం వ్యక్తం చేశారు. నన్ను కుక్కలా మొరుగుతానని ఆశుతోష్ రాణా అంటారు. ఎలా నడుచుకోవాలో నేర్చుకోవాలని సోనూ సూద్ సలహాలు ఇస్తారు. రాఖీ సావంత్ నా వ్యక్తిత్వాన్ని ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేస్తుంది. ఇక తాప్సీ పన్ను అయితే నా తల్లిదండ్రులు.. నా పెంపకం.. నా నేపథ్యాన్ని వరుసగా అవమానిస్తూనే ఉంది! అని కంగనా మండిపడ్డారు తమ కెరీర్‌లో తాను సాధించిన విజయంలో కనీసం 1 శాతం కూడా సాధించలేని వారి ఉచిత సలహాలు వినేందుకు తాను సిద్ధంగా లేనని కంగనా స్పష్టం చేశారు. నా లైఫ్‌లో నేను సాధించిన విజయంలో ఒక శాతం కూడా సాధించని వారి జ్ఞానాన్ని నేను వినను. పరిశ్రమలో విఫలమై.. ఆదరణ లేని కొందరు వ్యక్తులు ఎప్పుడూ నన్ను తిడుతూనే ఉంటారు. వారు మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఇదంతా చేస్తున్నారు. ముందు నా స్థాయికి ఎదగండి.. ఆ తర్వాత మాట్లాడండి. నాకంటే ఎక్కువ విజయం సాధించిన వారు చెబితేనే నేను వింటాను.. ఇక సహించేది లేదు! అని వ్యాఖ్యానించారు.జెన్ జెడ్ .జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనలపై కంగనా చేసిన కామెంట్లు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో కొంతమంది యువకులను, మహిళలను -జనరేషన్ గట్టర్- అని కంగనా సంబోధించడాన్ని సోనూ సూద్ తప్పుపట్టారు. అదేవిధంగా తాప్సీతోనూ కంగనకు పాత విభేదాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలో 2014లోనే భారత్‌కు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని కంగనా అన్న మాటలపై రాఖీ సావంత్ పంచ్ లు విసిరారు.